ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5 కర్ణాటక వార్తలు

ఆదివారం 26 జనవరి 2025



గంగిరెద్దుకు పూజలు

నిజం.. గెలిపించింది మీరే..!

- చంద్రబాబు అరెస్ట్‌పై బెంగళూరులోనే తీవ్ర నిరసన
- అదే స్ఫూర్తి ఏపీ, తెలంగాణ, ప్రపంచమంతా పాకింది
- ఏపీ అభివృద్ధి..పెట్టుబడుల సాధనే చంద్రబాబు లక్ష్యం
- టీడీపీ ఫోరం సంక్రాంతి వేడుకల్లో నారా భువనేశ్వరి



పొంగల్ తయారీలో నారా భువనేశ్వరి

బెంగళూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసినప్పుడు 'నిజం గెలవాలి' అనే నినాదం ఇచ్చాను. దీనికి తక్షణమే స్పందించి బెంగళూరులో ఎందరో అభిమానులు రోడ్డెక్కి నిరసన చేపట్టి నిజాన్ని గెలపించారని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి ప్రశంసించారు. బెంగళూరు తెలుగుదేశం పార్టీ ఫోరం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు కేఆర్‌పుర అంబేడ్కర్ మైదానంలో శనివారం జరిగాయి. ఎమ్మెల్యేలు గురజాల జగన్‌మోహన్, అమిలినేని సురేంద్ర బాబు ముఖ్యులుగా పాల్గొనగా ఎమ్మెల్సీ శ్రీకాంత్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన నారా భువనేశ్వరి మాట్లాడుతూ చంద్రబాబు అరెస్ట్ అయిన సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం కార్యకర్తలు నాయకులు నిరసనలు తెలిపేందుకు భయపడే పరిస్థితి ఉండేదన్నారు. బెంగళూరులో ప్రాంతాలవారీగా రోజూ వందలాది మంది రోడ్డెక్కి నిరసనలు తెలిపారని, ఆ స్ఫూర్తి ఆంధ్రప్రదేశ్‌కు విస్తరించి తెలంగాణకు ప్రాకి దేశమంతటా ప్రబలిందని ప్రపంచంలోని ఎన్నో దేశాల్లో మద్దతుగా ఆందోళన చేశారన్నారు. నేడు చంద్రబాబు సీఎం కావడంతోనే ఏపీ ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ప్రపంచ ప్రముఖ సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారని ఏపీకి చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ అని అభిప్రాయపడ్డారు. టీడీపీ ఫోరం కన్వీనర్ కనకమేడల వీర 12ఏళ్ల ప్రస్థానాన్ని వివరించారు. సోంపల్లి శ్రీకాంత్, టీడీపీ కన్వీనర్ రావిమోహన్ చౌదరి తదితరుల పర్యవేక్షణలో వేడుకలు జరిగాయి. నారా భువనేశ్వరికి ఫోరం మహిళా సభ్యులు సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ బెంగళూరులోని పార్టీ కార్యకర్తలు, ఫోరం ప్రతినిధులను ఎప్పటికీ మరువలేమన్నారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం బెంగళూరు అభిమానులే కాకుండా దేశ విదేశాలనుంచి సంపూర్ణంగా మద్దతు ఇచ్చారని వేలు, లక్షలనే లెక్క చేయకుండా ఓట్లు వేసేందుకు సొంతూళ్లకు కదిలి వచ్చారన్నారు. అందరి సహకారంతోనే ఆంధ్రప్రదేశ్‌లో సంతృప్తికరమైన ప్రభుత్వం ఏర్పడిందన్నారు. చంద్రబాబు నిరంతరం ఏపీ అభివృద్ధిని ఆకాంక్షిస్తారన్నారు. రిలాక్స్ కావాలని, కుటుంబంతో గడపాలని భావించడం లేదని, కానీ ఎక్కడనుంచి పెట్టుబడులు తీసుకురావాలనే ఆలోచిస్తుంటారన్నారు. ఇటీవలి ఐదేళ్లలో రాష్ట్రం దెబ్బతిందని ప్రస్తుతం చంద్రబాబే ఓ రాయబారిగా మారి ప్రపంచ ప్రముఖ కంపెనీ ముఖ్యులతో చర్చిస్తున్నారన్నారు. తెలుగువారికి కష్టపడే మనస్తత్వం, తెలివితేటలు ఉన్నాయన్నారు. అదే గ్లోబల్ లీడర్స్‌గా ఎదిగేందుకు కారణమవుతోందన్నారు. పోలవరం, అమరావతి మరో మూడేళ్లలో పూర్తి కానున్నాయన్నారు. ఒకప్పుడు చంద్రబాబు దేశంలోనే కంప్యూటర్ విధానం ముందుకు రావాలని తీసుకొచ్చి 2020 విజన్‌కు ప్రయత్నించారని అదే ఎంతోమంది ఐటీ నిపుణులను తయారు చేసిందన్నారు. ప్రస్తుతం దేశ విదేశాలలో ఐటీ కంపెనీలలో తెలుగువారు పనిచేయడం సంతోషంగా ఉందన్నారు.



వేదికపై నారా భువనేశ్వరి, గురజాల జగన్ మోహన్, టీడీపీ నాయకులు



ముగ్గుల పోటీలు వీక్షిస్తూ

సంక్రాంతి.. తెలుగు వారి పండుగ

మన సంప్రదాయంలో ప్రతి పండుగకు ఓ చరిత్ర ఉందని, సంక్రాంతికి ప్రత్యేకత ఉందని కొనియాడారు. ఏడాది పండించిన పంటలు ఇంటికొచ్చాక జరుపుకొనే పండుగ అని అందుకే ఎద్దులకు పూజలు చేస్తారన్నారు. మకర సంక్రాంతివేళ గొబ్బెమ్మలు, హరిదాసులు, చిన్నపిల్లలకు భోగిపళ్లతో ఆశీర్వాదాలు సంస్కృతిలో భాగమన్నారు. ఉద్యోగాలకోసం బెంగళూరులో స్థిరపడినా సంప్రదాయంగా పండగ జరపడం సంతోషంగా ఉందన్నారు. కాగా తెల్లవారుజామునే సంబరాలు ప్రారంభించారు. భోగిమంటలు, ముగ్గులపోటీలతో పాటు వివిధ గ్రామీణ క్రీడలు ఉత్సాహంగా జరిపారు.

చేనేత సమస్యలు వివరించిన కార్మికులు

ఏపీ సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరి బెంగళూరు పర్యటనకు వచ్చిన సందర్భంగా ఏపీ అభ్యుదయ దేవాంగసంఘం కన్వీనర్ పాపన్న చేనేత సమస్యలను వివరించారు. చేనేతకు జీఎస్టీ తొలగించేలని ముఖ్యమంత్రికి వివరించాలని కోరారు. ఆమెకు పట్టుచీర, పసుపు కుంకుమ అందచేశారు. పృథ్వి పురుషోత్తమ్ తదితరులు ఉన్నారు.



హాజరైన ప్రజలు

రౌడీలచేత అప్పుల వసూళ్లా..?

- మైక్రో ఫైనాన్స్ నియంత్రణ సమీక్షలో సీఎం ఆగ్రహం



సమావేశంలో సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, హోం మంత్రి పరమేశ్వర్

బెంగళూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మైక్రో ఫైనాన్స్ వేధింపులపై సీఎం సిద్దరామయ్య తీవ్రంగా మండిపడ్డారు. ఇటీవల కొన్ని రోజులుగా కొనసాగుతున్న దారుణ సంఘటనలపై సీఎం తీవ్రంగా స్పందించారు. రౌడీలచేత అప్పులు వసూళ్లు చేయిస్తారా..? అంటూ పోలీసుల అధికారుల తీరును తప్పుబట్టారు. శనివారం మైక్రో ఫైనాన్స్ వేధింపులపై ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. డీసీఎం డీకే శివకుమార్, హోం మంత్రి పరమేశ్వర్, రెవెన్యూ మంత్రి కృష్ణబైరే గౌడ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిన రజనీశ్, డీజీపీ అలోక్ మోహన్‌తోపాటు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం సీఎం సిద్దరామయ్య మీడియాతో మాట్లాడుతూ మైక్రో ఫైనాన్స్ నుంచి రుణాలు తీసుకున్న వారు వేధింపులకు గురికాకుండా ఆర్డినెన్స్ తీసుకురాదలిచామన్నారు. బలవంతంగా వసూళ్లు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, సుమోటోగా కేసులు నమోదు చేసేలా చట్టంలో మార్పులు తీసుకురాదలిచామన్నారు. ప్రస్తుతం ఉన్న చట్టాలను సవరించి మరింత బలోపేతం చేస్తామన్నారు. అనుమతులు లేకుండా ఫైనాన్స్‌లు చేసేవారిపై నిఘా కొనసాగించాలని ఇందుకు పోలీసులకు మరిన్ని అధికారాలు అప్పగించదలిచామన్నారు. బెదరించి వసూళ్లకు పాల్పడతామంటే సహించేది లేదన్నారు. పేద, సామాన్యవర్గాల రక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మైక్రో ఫైనాన్స్‌నుంచి వేధింపులు ఉంటే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని జిల్లాస్థాయిలో డీసీ, ఎస్పీలకు ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ప్రతి జిల్లా అధికారి కార్యాలయంలో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయదలిచామన్నారు. రెగ్యులరైజ్‌లేని కంపెనీలను రద్దు చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. సాయంత్రం 5 గంటల తర్వాత ఎవరూ అప్పుల వసూళ్లకు వెళ్లరాదని, బెదరించరాదని, అప్పుల వసూళ్లకు ఇతరులను వెంట తీసుకెళ్లరాదని సూచించారు. ఒక కుటుంబానికి ఎంత అప్పు ఇవ్వాలనేది ఆర్‌బిఐ నిబంధన ఉందని, అది పాటించారా లేదా అనేది పరిశీలిస్తామన్నారు.

సర్వం సిద్ధం..!

- నేడు గణతంత్ర వేడుకలు
- మాణెక్ షా పరేడ్ మైదానంలో పతాకావిష్కరణ చేయనున్న గవర్నర్

బెంగళూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంతటా 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. ముం దస్తు బందోబస్తు చర్యలలో భాగంగా బెంగళూరు సహా రాష్ట్రంలోని చారిత్రాత్మక కట్టడాలు, ప్రధాన ప్రాంతాలలో కట్టుదిట్టమైన విధానాలు అమలుపరిచారు. బెంగళూరు కెం పేగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, మంగళూరు ఎయిర్‌పోర్ట్‌తోపాటు రాష్ట్రమంతటా ప్రత్యేకంగా పోలీసుల నిఘా వహించారు. పరేడ్‌మైదానం చుట్టూ శనివారం మధ్యాహ్నం నుంచే పోలీసులు అదుపులో ఉంచుకున్నారు. నిరంతరం బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. నగరంలోని మాణెక్ షా పరేడ్ మైదానంలో గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం వివిధ బలగాల చేత గౌరవ వందనం స్వీకరిస్తారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి సిద్దరామయ్య పాల్గొననున్నారు. పరేడ్ మైదానంలో వందలాదిమంది విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతాయి. గవర్నర్ అశ్వదళాలతోపాటు పోలీసు పహారామధ్య రాజ్‌భవన్ నుంచి పరేడ్ మైదానానికి వెళ్లే ప్రత్యేక వేడుకను చూసేందుకు నగర ప్రజలు ఉత్సాహం చూపుతున్నారు. క్రాంతివీర సంగొళ్ళిరాయణ్ణ 194వ స్మరణోత్సవం నిర్వహించనున్నారు. సాయంత్రం రాజ్‌భవన్‌లో తేనీటి విందు ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్యసమరయోధులతోపాటు విభిన్నరంగాల ప్రముఖులను ఆహ్వానించారు. రాత్రికి రవీంద్రకళాక్షేత్రలో కన్నడ సంస్కృతిశాఖ రిపబ్లిక్‌డేను పురస్కరించుకుని ప్రత్యేకమైన సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి.

జిల్లాల వారీగా ఏర్పాట్లు

రాష్ట్రంలోని 31 జిల్లాల పరిధిలో జిల్లా అధికారులు పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ అధికారులను ప్రకటించారు. వారికి జిల్లా అధికారి ప్రత్యేకమైన ప్రశంసాపత్రాలను బహూకరించనున్నారు. మరోవైపు జిల్లా స్థాయిలో ఎంపికైన అధికారులతోపాటు వారి కుటుంబ సభ్యులలో సంతోషం వ్యక్తం అవుతోంది. కాగా యక్షగాన కళాకారులు రిపబ్లిక్‌డేను పురస్కరించుకుని బసవనగుడిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వరల్డ్ కల్చర్ ప్రాంగణంలో భారీ జాతీయపతాకంతో ప్రత్యేకమైన ప్రదర్శన ఆకట్టుకుంది.



బసవనగుడిలో భారీ జాతీయపతాకంలో యక్షగాన కళాకారులు, విద్యార్థులు

21మంది పోలీసు అధికారులకు రాష్ట్రపతి పతకాలు

బెంగళూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని రాష్ట్రానికి చెందిన 21మంది పోలీసు అధికారులకు రాష్ట్రపతి పతకాలు వరించాయి. కేంద్రప్రభుత్వం ప్రకటించిన విధంగా కేఎస్ఆర్‌పీ బెంగళూరు డీఐజీ బసవరాజ్ శరణప్ప జిల్లె, కేఎస్ఆర్‌పీ 12వ బెటాలియన్ తుమకూరు కమాండెంట్ హంజా హుసేన్‌లకు రాష్ట్రపతి విశిష్టసేవా పతకం దక్కింది. మిగిలిన 19మందికి రాష్ట్రపతి సేవా పతకాలు వరించాయి. వారిలో బెంగళూరు డీఆర్‌సీ డీఐజీ రేణుకా సుకుమార్, ఏఐజీ బెంగళూరు సంజీవ్ ఎం పాటిల్, సీసీబీ ఏసీపీ గోపాల్ డి జోగిన్, కొప్పళ ఐఆర్‌బీ కమాండెంట్ బీఆర్ ప్రసాద్, బెంగళూరు కేఎస్ఆర్‌పీ డిప్యూటీ కమాండెంట్ ఎన్ వీరేంద్రనాయక్, చిక్కోడి డీఎస్పీ గోపాల కృష్ణ బి గౌడర్, చిత్రదుర్గ లోకాయుక్త ఇన్‌స్పెక్టర్ హెచ్ గురుబసవరాజ్, బెంగళూరు గోవిందపుర ఇన్‌స్పెక్టర్ హెచ్ జయరాజ్, హొళె నరసీపుర ఇన్‌స్పెక్టర్ బీఆర్ ప్రదీప్, బెంగళూరు సీసీబీ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ముక్రమ్, బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ ఇన్‌స్పెక్టర్ ఎన్ఏ వసంతకుమార్, బెంగళూరు సీఐడీ ఏఎస్ఐ బీజీ మంజునాథ్, ఏఎస్ఐ అల్తాఫ్ హుసేన్ దఖని, కేఎస్ఆర్‌పీ హెచ్‌డ్‌కానిస్టేబుల్ బళేంద్రన్, కలబురగి హెడ్ కానిస్టేబుల్ అరుణ్‌కుమార్, చిక్కమగళూరు హెడ్‌కానిస్టేబుల్ నయాజ్ అంజుమ్, బెంగళూరు పశ్చిమవిభాగం హెచ్‌సీ ఎం శ్రీనివాస్, ఇంటెలిజెన్స్ సీనియర్ అధికారి పీఎం అష్రఫ్, కుందాపుర హెచ్‌సి శివానందతో పాటు హోంగార్డు, సివిల్ పోలీస్ విభాగంలోని ఆరుగురు అధికారులు, అగ్నిమాపక విభాగంలోని ఇద్దరికి పతకాలు వరించాయి.



బసవరాజ్ శరణప్ప జిల్లె, డీఐజీ



కమాండెంట్ హంజా హుసేన్

అంతులేని వేధింపులు..!

- 'మైక్రో' దెబ్బకు ఊళ్లు వదిలిపోతున్న బాధితులు

బళ్లారి గాంధీనగర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్రంలో మైక్రో ఫైనాన్షియర్ల ఒత్తిళ్ల కారణంగా బాధితులు ఊళ్ళు వదిలి వెళ్లి పోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా మైక్రో ఫైనాన్సర్లపై దృష్టిసారించి మైక్రో ఫైనాన్సర్ల నుంచి ప్రజలను రక్షించే ప్రయత్నం చేస్తోంది. విజయనగర జిల్లా పరిధిలోని హరపనహళ్ళి తాలూకా శివపుర తండాలో ఓ ఇంటికి ఫైనాన్స్ సంస్థలు నోటీసు అంటించడంతో పాటు ఇల్లు తాకట్టులో ఉందని పెద్ద అక్షరాలతో రాశారు. అవమానంతో ఇంటి యజమాని రవి నాయక్ కుటుంబ సభ్యులతో గ్రామాన్ని వదిలి వెళ్లిపోయారు. ప్రభుత్వ పీయూ కళాశాలలో అతిథి ఉపన్యాసకుడిగా పనిచేస్తున్న రవి నాయక్ ఇంటిపై రూ 6లక్షలు మైక్రో ఫైనాన్స్ నుంచి అప్పు తీసుకున్నాడు. ప్రతి నెలా రూ 9,271లు చొప్పున ఇప్పటి వరకు 18 కంతులు ప్రకారం ఇప్పటి వరకు రూ.1,66,878 చెల్లించాడు. అయితే ఇటీవల ఆయన్ని ఉద్యోగం నుంచి తొలగించారు. దీంతో గత సెప్టెంబరు నుంచి ఇప్పటి వరకు కంతు చెల్లించలేదు. అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న ఉపన్యాసకుడు మైక్రో ఫైనాన్స్ సిబ్బంది తీవ్రంగా వేధిస్తున్నట్లు తెలిసింది. కేవలం ఆరు నెలలు కంతు చెల్లించలేదని ఇంటి ఇంటి గోడలకు నోటీసులు అంటించడంతో పాటు గోడలపై పెద్ద అక్షరాలతో ఇల్లు తాకట్టులో ఉందని అందరికీ తెలిసేలా రాసి అవమానించినట్లు బాధితుడు మీడియా ముందు వాపోయాడు. మైక్రో ఫైనాన్స్ కంపెనీ వారు కంతు చెల్లించడానికి అవకాశం ఇవ్వడం లేదని తనకు పోలీసులు న్యాయం చేయాలని బాధితుడు కోరుకుంటున్నాడు.



'తాకట్టులో ఉంది' అని ఇంటిపై రాసిన మైక్రో సిబ్బంది

రాష్ట్రం నుంచి 9మందికి పద్మ పురస్కారాలు

బెంగళూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్రం సందర్భంగా రాష్ట్రం నుంచి 9 మందిని పద్మ పురస్కారాలకు కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. పద్మవిభూషణ్ పురస్కారం వయోలిన్ కళాకారుడు లక్ష్మీనారాయణ సుబ్రమణియమ్‌కు దక్కింది. పద్మభూషణ్ పురస్కారాలు ఇద్దరికి దక్కగా సాహిత్యం, విద్య, పాత్రికేయ రంగాల్లో ప్రముఖుడిగా పేరొందిన ఏ సూర్యప్రకాశ్‌కు వరించింది. ఇతను జాతీయస్థాయిలో ప్రముఖమైన కాలమిస్ట్‌గా గుర్తింపు పొందారు. కన్నడ సినిమా రంగంలో మేరుపర్వతం అనేలా పేరొందిన అనంత్‌నాగ్‌కు పద్మభూషణ్ దక్కింది. దాదాపు నాలుగు దశాబ్దాలుగా అనంత్‌నాగ్ సినిమారంగంలో ఉన్నారు. హీరోగా సుదీర్ఘకాలం కొనసాగిన అనంత్‌నాగ్ ప్రస్తుతం క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గాను రాణిస్తున్నారు. ఇక ఆరుగురిని పద్మశ్రీ పురస్కారాలు వరించాయి. కళా రంగంలో కొప్పళకు చెందిన తోలుబొమ్మలాట కళాకారిణి భీమవ్వ దొడ్డబాళప్ప శిళ్ళేక్యాతకు దక్కింది. రికీ గ్యాన్‌కేజ్‌కు అంతర్జాతీయస్థాయిలోనూ గుర్తింపు వచ్చింది. ఇటీవలే గ్రామీ అవార్డు పొందారు. సినిమారంగంలో హాసన్ రఘు ఫైట్‌మాస్టర్‌గా పేరొందారు. ప్రశాంత్ ప్రకాశ్‌కు ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ విభాగంలో అవార్డు వచ్చింది. జానపద కళాకారుడు వెంకప్ప అంబాజీ సుగతేకర్, కిద్వాయ్ ఆసుపత్రిలో సేవలందించిన డాక్టర్ డాక్టర్ విజయ లక్ష్మీ దేశ్‌మానె పద్మశ్రీకి ఎంపికయ్యారు.



లక్ష్మీనారాయణ సుబ్రమణియమ్



అనంతనాగ్



భీమవ్వ దొడ్డబాళప్ప శిళ్ళేక్యాత



రికీగ్యాన్ కేజ్



డాక్టర్ విజయ లక్ష్మీ దేశ్‌మానె



వెంకప్ప అంబాజీ సుగతేకర్



సూర్య ప్రకాశ్

కేఆర్‌పురలో నవరతన్ జ్యువెల్స్ ప్రారంభం

బెంగళూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కేఆర్‌పురలో నవరతన్ జ్యువెల్స్‌ను స్థానిక ఎమ్మెల్యే బైరతి బసవరాజ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బసవరాజ్ మాట్లాడుతూ కేఆర్‌పురలో సరికొత్త జ్యువెల్స్ షాప్ ప్రారంభం కావడం సంతోషంగా ఉందన్నారు. వినియోగదరులకు అవసరమైన ఆభరణాలను అందుబాటులోకి వచ్చాయన్నారు. నవరతన్ జ్యువెల్స్ ఎండీ గౌతమ్‌చంద్ మాట్లాడుతూ నగరంలో ఆరోశాఖను ప్రారంభించామన్నారు. ఇప్పటికే ఎంజీ రోడ్డు, జయనగర్, రాజాజినగర్, యలహంక, కమర్షియల్ స్ట్రీట్‌లలో బ్రాంచ్‌లు ఉన్నాయని కేఆర్‌పుర టీసీపాళ్యలో అందుబాటులోకి వచ్చామన్నారు. సంస్థ డైరెక్టర్ మహేంద్ర బాప్నా, మిథేశ్‌బాప్నా, సంస్థ వైస్‌ప్రెసిడెంట్ అరుణ్‌కుమార్‌లు పాల్గొన్నారు. మరో రెండురోజులు ప్రత్యేక ఆఫర్‌లు ఉంటాయని ప్రకటించారు.



నవరతన్ షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బైరతి బసవరాజ్

విజేత సూపర్‌మార్ట్ ప్రారంభం


స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థ


సూపర్ మార్ట్‌ను సందర్శిస్తున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు

అనంతపురం కల్చరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని రామ్‌నగర్ 80 అడుగుల రోడ్డులో విజేత సూపర్‌మార్ట్‌ను ఎంపీలు టీకే పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఎంఎస్ రాజు, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థ శనివారం ప్రారంభించారు. వ్యాపారపరంగా అనంతపురం విస్తరిస్తోందని అన్నారు. నాణ్యత, నమ్మకానికి బ్రాండ్‌గా ఉండేలా విజేత సూపర్‌మార్ట్‌లను ఎండీ జగన్మోహన్‌రావు అన్ని జిల్లాల్లోనూ విస్తరిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో విజేత మార్ట్ నిర్వాహకులు సందీప్, హరికృష్ణ, టీడీపీ నాయకులు ముంటిమడుగు కేశవరెడ్డి, రామలింగారెడ్డి, ఆదినారాయణ, సరిపూటి రమణ, రాయల్ మురళి, టీఎన్ఎస్ఎఫ్ లక్ష్మీనారాయణ, కూచె హరి, బుగ్గయ్య చౌదరి, నెట్టెం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


నేమకల్లు ఆంజనేయుడికి విశేష పూజలు

బొమ్మనహాళ్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి మూలవిరాట్‌కు శనివారం విశేష పూజలు జరిగాయి. ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్‌చార్యులు, సంతోష్‌కుమార్ చార్యులు, పవన్ కుమార్ పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, అష్టోత్తరం జరిపించి పుష్పాలంకరణ చేసి నైవేద్యం సమర్పించారు. వందలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.


ప్రత్యేక అలంకరణలో నేమకల్లు ఆంజనేయస్వామి

నెట్టికంటికి వెండి రథ ప్రాకారోత్సవం




అలంకారాలలో స్వామివార్లు.. కసాపురం ఆలయంలో వెండి రథ ప్రాకారోత్సవం


గుంతకల్లు, జనవరి25(ఆంధ్రజ్యోతి): కసాపురం ఆలయంలో శనివారం స్వామివారికి వెండి రథ ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం 6-40 గంటలకు అర్చకులు సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయుల ఉత్సవ విగ్రహాలకు సర్వాంగ సుందరంగా అలంకారాలు చేసి వెండి రథంపై ఆశీనులను చేశారు. ఆలయ ఈఓ వాణి ఆధ్వర్యంలో స్వామివార్ల వెండి రథ ప్రాకారోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు, సూపరింటెండెంటు పిడికిటి వెంకటేశ్వరులు, అర్చకులు, వేద పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏమార్చి లూటీ!

ఏటీఎం కార్డు మార్చి డబ్బు కాజేస్తున్న దుండగులు

- డబ్బు డ్రా చేయడం రాక వారికిస్తే అంతే సంగతి
- ఏటీఎం సెంటర్ల వద్ద కాపు కాస్తున్న 'వేటగాళ్లు'
- అమాయకులే వారి టార్గెట్
- గుత్తిలో జూలై నుంచి 15 సంఘటనలు
- ఐదు నెలల కిందట తాడిపత్రిలో నాలుగు...


ఎంగిలిబండ రాజుకు చెందిన ఏటీఎం కార్డు మారుస్తున్న దుండగులు



ఏటీఎం కార్డు వాడటం రాని అమాయకులకు సాయం చేస్తున్నట్లు నటించి, బురిడీ కొట్టించే ఘటనలు జిల్లాలో ఇటీవల ఎక్కువ అయ్యాయి. గుత్తి పట్టణ పరిధిలోనే ఇటీవల వరుసగా నాలుగు ఘటనలు జరిగాయి. గత ఏడాది జూలై నుంచి గుత్తి పట్టణ పరిధిలోనే 15 ఘటనలు జరిగాయి. ఐదు నెలల కిందట తాడిపత్రి పట్టణ పరిధిలో నలుగురు ఇలానే మోసపోయారు. రెండు నెలల కిందట ఉరవకొండలో రైతును ఓ దుండగుడు ఇలానే మోసం చేశాడు. మోసపోయామని బయటకు చెప్పుకోలేని బాధితులు ఎంతో మంది ఉన్నారు. కొందరు ఆగంతకులు నకిలీ కార్డులతో ఏటీఎం సెంటర్ల వద్ద కాపు కాస్తున్నట్లు తెలుస్తోంది. గంటలకొద్దీ వేచి చూసి ఏటీఎంను ఆపరేటింగ్ చేయడం రాని వారిని మోసగిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి అనంతపురం క్రైం

ఎలా బురిడీ కొట్టిస్తారంటే...

దుండగులు ఏటీఎం సెంటర్ల వద్దే ఉంటారు. నగదు డ్రా చేస్తున్నట్లో.. క్యాష్ చెక్ చేస్తున్నట్లో నటిస్తుంటారు. లేదా అక్కడే ఫోన్‌లో మాట్లాడుతూనో కనిపిస్తారు. వారు ఏటీఎం ఆపరేట్ చేయడం రాని వ్యక్తుల ముఖకవళికలను సులభంగా కనిపెట్టేస్తారు. ఎవరైనా డబ్బు తీసిస్తారా...? అని అడగడం ఆలస్యం... వెంటనే ముందుకు వస్తారు. తొలుత వారి ఏటీఎంల ద్వారా మిషన్‌లో కార్డు పెట్టి పాస్ వర్డ్ కనుక్కుంటారు. కానీ డబ్బు విత్ డ్రా చేయరు. సర్వర్ సమస్య వస్తుందని కహానీలు చెబుతారు. ఇంకా కొంచెం టైం పడుతుందని చెబుతారు. నాకూ పనుందని చెప్పి, నకిలీ కార్డు చేతిలో పెట్టి వెళ్తారు. అలా బయటకు వెళ్లిన కొంతసేపటికే మరో ఏటీఎంలో డబ్బు డ్రా చేస్తారు. దుండగుడు కార్డు ఇచ్చేటప్పుడే దాన్ని చెక్ చేసుకుంటే మోసపోయే అవకాశం తగ్గుతుంది.

బ్యాంకుల నిర్లక్ష్యం

ఏటీఎంల వద్ద బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. అక్కడ సెక్యూరిటీ గార్డులు లేకపోవడంతోనే ప్రజలు అపరిచితులను ఆశ్రయించాల్సి వస్తోంది. కొన్ని ఏటీఎం సెంటర్లలో గార్డులున్నా ఆగంతకులు అక్కడే తచ్చాడుతుంటారు. అయినా వారిని ప్రశ్నించడంలో గార్డులు విఫలమవుతున్నారు. బాధితులు ఇలా మోసపోకుండా బ్యాంకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

గర్భిణి అన్న కనికరం లేకుండా..!

గుత్తి ఆర్టీసీ బస్టాండ్‌లో ఇండియన్ ఏటీఎం సెంటర్లో ఓ మహిళ నుంచి ఏటీఎం కార్డు మార్చి రూ.50వేలు సొమ్ము దోచేశారు. పెద్దవడుగూరు మండలం గుత్తి అనంతపురానికి చెందిన చిలకల వేదవతి(గర్భిణి) డెలివరీ కోసం ఆసుపత్రికి వెళ్లాల్సి ఉంది. ఈ క్రమంలో ఈనెల 21డబ్బు అవసరమై మరో మహిళతో కలిసి ఆర్టీసీ బస్టాండ్‌లోని ఇండియన్ ఏటీఎం సెంటర్‌కు వెళ్లారు. అక్కడ ఆగంతకులు ఏటీఎం కార్డు మార్చారు. నకిలీ కార్డు ఆమెకిచ్చారు. కానీ 22, 23 తేదీల్లో రెండు రోజుల పాటు ఆమె ఏటీఎం కార్డు ద్వారా రూ.50వేలు డ్రా చేశారు.


గద్దల లక్ష్మీదేవి ఏటీఎం కార్డు అపహరిస్తున్న దుండగుడు

- తాడిపత్రి పట్టణంలో ఐదు నెలల కిందట నెలన్నర వ్యవధిలో ఆరు సంఘటనలు ఇలాంటివే జరిగాయి. రాఘవయ్య అనే బాధితుడు రూ.40వేలు నష్టపోయాడు. మరో వ్యక్తి ఏటీఎంను ఏమార్చి రూ.20వేలు డ్రా చేశారు. మరో నలుగురి నుంచి రూ.80డ్రా చేసినట్లు బాధితులు వాపోయారు.

- ఈనెల 10వతేదీ గుత్తి పట్టణానికి చెందిన వృద్ధురాలు లక్ష్మీదేవి తన భర్తతో ఏటీఎం కార్డు ఇచ్చి పంపింది. రూ.3వేలు డ్రా చేయమని చెప్పింది. ఏటీఎం సెంటర్‌లో ఆపరేటింగ్ చేయడం రాకపోవడంతో అక్కడే ఉన్న ఓ యువకుడిని అతడు సాయం అడిగాడు. ఇదే అవకాశంగా భావించిన ఆ యువకుడు వృద్ధుడిని మభ్యపెట్టాడు. పాస్‌వర్డ్ తెలుసుకుని అందులో టైప్ చేశాడు. కానీ నగదు డ్రా చేయలేదు. సర్వర్ బిజీగా ఉందని, మళ్లీ తీసుకోవాలని, తనకు పనుందని బయటకు వెళ్లిపోయాడు. అయితే ఆ వృద్ధుడి ఏటీఎం కార్డు గుట్టుగా తనవద్ద ఉంచుకుని మరో కార్డు అతడి చేతిలో పెట్టాడు. కొంతసేపటికే ఆ దుండగుడు మరో ఏటీఎంలో రూ.9300 డ్రా చేశాడు. నగదు డ్రా అయినట్లు వృద్ధుడికి మెసేజ్ రావడంతో ఆందోళన చెందాడు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా కేసు దర్యాప్తు చేపట్టారు.
- ఈనెల 17న గుత్తి రూరల్ మండల పరిధిలోని ఎంగిలిబండకు చెందిన రాజు మోసపోయాడు. తల్లి అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్యం కోసం రాజు, భార్య లక్ష్మి పేరుతో తొండపాడు కెనరా బ్యాంకులో స్వయం సహాయక గ్రూపులోని పొదుపు సొమ్ము రూ.1.26లక్షలు రుణం తీసుకున్నారు. గుత్తిలోని ఏటీఎం సెంటర్‌కు డబ్బు డ్రా చేయ డానికి వెళ్లాడు. ఈ సమయంలో ఇద్దరు గుర్తుతెలియని దుండగులు డ్రా చేయడానికి సాయం చేస్తామన్నారు. ఆ ముసుగులో పాస్‌వర్డ్ తెలుసుకున్నారు. వారి దగ్గరున్న నకిలీ ఏటీఎం కార్డు రాజుకు ఇచ్చి, అతడి కార్డుతో వెళ్లిపోయారు. ఆ దొంగలు అదే రోజు కర్నూలు నగరంలోని ఓ ఏటీఎంలో రూ.1.26లక్షలు డ్రా చేసుకున్నారు. మూడు రోజుల తరువాత రాజు గుత్తికి వచ్చి ఏటీఎం మరో వ్యక్తితో చూపించాడు. కానీ అది నీది కాదని, పాస్‌వర్డ్ సెట్ కాలేదని చెప్పడంతో అది నకిలీదిగా తేలడంతో రాజు నిర్ఘాంతపోయాడు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.
- చదువురాని వారు మోసపోతున్నారంటే అవగాహన లేదనుకోవచ్చు. కానీ యానిమేటర్లు కూడా మోసపోతుండటం విస్తు గొలుపుతోంది. గత ఏడాది జూలై11న వెలుగు డీఆర్‌డీఏ కార్యాలయంలో పనిచేస్తున్న యానిమేటర్ గద్దల లక్ష్మి ఇలానే మోసపోయింది. గుర్తు తెలియని వారిని నమ్మి ఏటీఎం కార్డు అందజేసి రూ.47వేలు డ్రా చేయడంతో లబోదిబోమంది.


బ్యాంకులో సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్న పోలీసులు

- రెండు నెలల కిందట యాడికికి చెందిన ఈశ్వరయ్యకు చెందిన ఏటీఎం కార్డు మార్చి దుండగులు రూ.46వేలు డ్రా చేసుకున్నారు.
- గత ఏడాది ఆగస్టు 31న పి.ఎర్రగూడుకు చెందిన శ్రీనివాసులు నుంచి రూ.24వేలు డ్రా చేశారు. ఏటీఎం కార్డుతోనే అతనూ మోసపోయాడు.
- ఉరవకొండలో గత ఏడాది నవంబరులో ఓ పల్లెటూరి పెద్దమనిషి ఏటీఎం వద్దకు వెళ్లాడు. డబ్బు తీయిస్తానని చెప్పి న ఆ అగంతకుడు మెషీన్ సరిగా పనిచేయడం లేదని చెప్పి ఏటీఎం కార్డు మార్చి వెళ్లాడు. కొంతసేపటికే మరో ఏటీ ఎం నుంచి రూ.79వేలు డ్రా చేసుకుని ఉడాయించాడు. దీంతో ఆ పెద్దమనిషి లబోదిబోమని పోలీసులను ఆశ్రయించాడు.

కేసులు...ఉత్తుత్తేనా..?

ఏటీఎంల వద్ద కార్డుల ద్వారా మోసపోతున్న బాధితులు చాలా మందే ఉంటున్నారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లను ఆశ్రయిస్తున్నప్పుడు వివరాలు రాసుకుని, ఏటీఎం సెంటర్లలోని సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. కానీ అక్కడికే పరిమితమై కేసులు నమోదు చేయడం లేదనే ఆరోపణలున్నాయి. కేసులు కడితే తప్పనిసరిగా దుండగులను పట్టుకోవాలి. లేకుంటే అవి పెండింగ్ కేసుల జాబితాలో ఉండే ప్రమాదం ఉంది. ఇవి ఉన్నతాధికారులతో తలనొప్పికి దారి తీస్తాయని కేసులు నమోదు చేయడం లేదని సమాచారం. అలాంటి వాటిపై పోలీసులు పెద్దగా దృష్టి సారించడం లేదనే విమర్శలున్నాయి. ఇప్పటివరకు ఏటీఎం మోసాలకు సంబంధించి పోలీసులు దుండగులను అరెస్ట్ చేసిన దాఖలాలు లేదా రికవరీ చేసిన వ్యవహారాలు లేవు. పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించినంతకాలం ఏటీఎం కార్డుల మోసాలు జరిగే అవకాశం ఉంది.

మీ అభిమానాన్ని గుండెల్లో పెట్టుకుంటాం

ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్


విలేకరులతో మాట్లాడుతున్న పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

రామగిరి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పరిటాల రవీంద్ర 20వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని, ప్రజలు చూపిన అభిమానాన్ని గుండెల్లో పెట్టుకుంటామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. వెంకటాపురంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. పరిటాల రవి వర్ధంతి సందర్భంగా వెంకటాపురం గ్రామానికి వేలాది మంది జనం తరలివచ్చారని, ప్రజానేతపై అభిమానాన్ని చాటుకున్నారని అన్నారు. జిల్లా నుంచే కాకుండా రాష్ట్రంలోని పలుప్రాంతాలు, తెలంగాణ, కర్ణాటక నుంచి ప్రముఖులు, అభిమానులు వచ్చి ఘన నివాళులు అర్పించారని అన్నారు. ఈ కార్యక్రమం కోసం వారం రోజులపాటు శ్రమించిన పోలీసులు, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ, శానిటేషన్ సిబ్బంది, వలంటీర్లు, కళాకారులు, భోజనశాల నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యాలయం, రాష్ట్రంలోని టీడీపీ కార్యాలయాలు, ఇతర ప్రాంతాలలో రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించారని, నివాళులు అర్పించారని, జనం చూపిన ఈ అభిమాన్ని ఎప్పటికీ మరువలేమని అన్నారు. పరిటాల రవి మరణించి 20 ఏళ్లు గడిచినా ప్రజల గుండెల్లో ఇంకా ఆయనకున్న స్థానం చూసి చలించిపోయామని అన్నారు. వర్ధంతికి వచ్చిన జన స్పందన తమ బాధ్యతను మరింత పెంచిందని అన్నారు. పరిటాల చూపిన మార్గంలో రానున్న రోజుల్లో ఉచిత వివాహాలు, మెగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామని అన్నారు. ఇక నుంచి రవి ఆశయ సాధనలో మరిన్ని అడుగులు పడతాయని, ప్రజల ఆదరాభిమానాలు ఇలాగే ఉండాలని కోరుకుంటునామని వారు అన్నారు.

రేపటి నుంచి బాలికల హాకీ టోర్నీ


అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఫాదర్ ఫెర్రర్ ఏపీ సబ్ జూనియర్ హాకీ బాలికల 13వ రాష్ట్రస్థాయి పోటీలు ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు జరుగుతాయి. ఆర్డీటీ స్టేడియంలో ఈ పోటీలు నిర్వహిస్తామని హాకీ అనంతపురం జిల్లా కార్యదర్శి అనీల్ కుమార్ తెలిపారు. ముఖ్య అతిథులుగా అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, టీడీపీ ధర్మవరం ఇంచార్జి పరిటాల శ్రీరామ్, అహుడా చైర్మన్ టీసీ వరుణ్, హాకీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు చాణక్యరాజ్ హాజరవుతారని తెలిపారు. 13 జిల్లాల బాలికల జట్లు పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు.

867 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శనివారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 867 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2 కు 458 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

అయ్యప్పకు బంగారం బిస్కెట్

అజ్ఞాత భక్తురాలి సమర్పణ


హుండీలో లభించిన కాగితం, బంగారు బిస్కట్

అనంతపురం కల్చరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి హుండీలో 10 తులాల బంగారు బిస్కట్ లభించింది. నగరంలోని రామ్‌నగర్ 80 అడుగుల రోడ్డులోని అయ్యప్ప దేవాలయంలో శనివారం ఆలయ నిర్వాహకులు హుండీ ఆదాయం లెక్కింపు చేపట్టారు. మొత్తం రెండు హుండీల్లో వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు. రూ.42,736లు, 10 తులాల బంగారు బిస్కట్ లభించాయి. బంగారం బిస్కట్‌కు చుట్టిన పేపర్‌పై 'ఓం స్వామియే శరణం అయ్యప్ప, అజ్ఞాత భక్తురాలు' అని రాసి ఉంది. ఆలయంలో త్వరలో చేపట్టనున్న విగ్రహ పునఃప్రతిష్ఠాపన నేపథ్యంలో బంగారు కిరీటం, స్వామివారికి బంగారు కవచం చేయించేందుకు దాతల నుంచి విరాళాలు స్వీకరిస్తున్నారు. ఇలాంటి తరుణంలో అజ్ఞాత భక్తురాలు బంగారు బిస్కట్‌ను హుండీలో వేయడం పట్ల ఆలయ కార్యవర్గం హర్షం వ్యక్తం చేసింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, పూజారి వాసు, భక్తులు పాల్గొన్నారు.

వదాన్య అశోక్‌కు అరుదైన గౌరవం


అశోక్‌పడపాటి

కొత్తచెరువు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వదాన్యసొసైటీ ద్వారా ప్రజా సేవ చేస్తున్న అశోక్ పడపాటికి అరుదైన గౌరవం లభించింది. రాజభవన్‌లో ఆదివారం నిర్వహించే గణతంత్ర వేడుకలకు ఆయనను ప్రత్యేకంగా ఆహ్వానిస్తూ కలెక్టర్ కార్యాలయం ద్వారా సమాచారం పంపారు. కొత్తచెరువు గ్రామానికి చెందిన అశోక్ పడపాటి వదాన్యసొసైటీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతో ప్రజాదరణ పొందాయి. విద్యార్థులలో ప్రతిభను వెలికితీయడానికి, యువత ఉద్యోగ అవకాశాలు పొందేందుకు అనేక రకాలైన పోటీ పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన సామాజిక సేవా కార్యక్రమాలు గుర్తించిన అధికారులు గణతంత్ర వేడుకలకు ఆహ్వానం పంపారు.

గంజాయి విక్రేతల అరెస్టు

మూడు కిలోల మత్తు పదార్థం స్వాధీనం

రాప్తాడు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రసన్నాయపల్లి రైల్వే గేట్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, రాప్తాడు సీఐ శ్రీహర్ష తెలిపారు. రాప్తాడులోని రూరల్ డీఎస్పీ కార్యాలయంలో శనివారం విలేకరులకు ఈ వివరాలను డీఎస్పీ తెలియజేశారు. అనంతపురం సాయినగర్ రెండో క్రాస్‌కు చెందిన పూల సునీల్ కుమార్, నవోదయ కాలనీకి చెందిన పోకల విజయ్‌కుమార్, అంబేడ్కర్ నగర్‌కు చెందిన బండారు శివప్రసాద్, రామకృష్ణ కాలనీకి చెందిన గొల్ల క్రాంతి కుమార్‌రెడ్డి, మంగళవారి కాలనీకి చెందిన బెస్త భాను ప్రకాష్, అనంతపురం రూరల్ మండలం కాటిగానికాలువకు చెందిన ఎర్రగుంట చంద్రకాంత్ రెడ్డి, తాడిపత్రి పట్టణానికి చెందిన మండ్ల కుళ్లాయప్ప బృందంగా ఏర్పడి గంజాయి వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు సీఐ శ్రీహర్ష, పోలీసు సిబ్బంది నిఘా వేసి, నిందితులను శనివారం అరెస్టు చేశారని తెలిపారు. నిందితులను రిమాండుకు తరలించామని తెలిపారు. గంజాయి ముఠాను పట్టుకున్న పోలీసు బృందాన్ని ఎస్పీ అభినందించారని తెలిపారు.

హక్కుల సాధన ఆయుధం.. ఓటు : జేసీ



యువ ఓటరుకు తొలి ఐడీ కార్డును అందజేస్తున్న జేసీ

అనంతపురం టౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకునే సాధనం ఓటు అని జాయింట్ కలెక్టరు శివనారాయణశర్మ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వివిధ పోటీలలో ప్రతిభ చాటిన విద్యార్థులు, సీనియర్ సిటిజన్స్‌ను సత్కరించారు. యవ ఓటర్లకు తొలి ఓటరు ఐడీ కార్డులను జేసీ అందజేశారు. ఓటు విలువపై ప్రతిజ్ఞ చేయించారు. ఓటర్లను ఎన్నికల పక్రియలో పాల్గొనేలా ప్రోత్సహించేందుకు ఏటా జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని జేసీ అన్నారు. ప్రతి సంవత్సరం ఒక థీమ్‌తో ఎన్నికల కమిషన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని అన్నారు. 'పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి. ఓటుకు సమానమైనది ఏదీ లేదు. ఖచ్చితంగా ఓటు వేస్తాను' అనే థీమ్‌తో ఈ ఏడాది కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్వో మలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతనాయుడు, ఈఆర్ఓలు శిరీష, మల్లికార్జున, డీసీహెచ్ఎస్ డాక్టరు రవికుమార్, కలెక్టరేట్ విభాగాల అధికారులు అలెగ్జాండర్, రియాజుద్దీన్, యుగేశ్వరి, వివిధ సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలయ్య.. పద్మ భూషణ్

మాడుగుల నాగఫణిశర్మకు పద్మశ్రీ

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు



పుట్టపర్తి/పుట్లూరు/అనంతపురం అర్బన్/జనవరి 25(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాల సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ అవార్డులలో ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యం దక్కింది. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పద్మభూషణ్ పురస్కారానికి ఎంపికయ్యారు. పుట్లూరు మండలం కడవకల్లు గ్రామానికి చెందిన మాడుగుల నాగఫణి శర్మకు పద్మశ్రీ అవార్డు దక్కింది. ఏకకాలంలో సినీ, రాజకీయ రంగాలలో తనదైన ముద్ర వేసిన నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ పురస్కారాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించగానే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆయన అభిమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. కళల విభాగంలో ఆయనకు పద్మభూషణ్ పురస్కారం లభించింది. టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ వారసుడిగా బాలకృష్ణ వెండి తెరపై సత్తా చాటుకున్నారు. తాతమ్మ కలతో మొదలుపెట్టి 109 జానపద, సాంఘిక, పౌరాణిక, చారిత్రక, సందేశాత్మక చిత్రాలలో ఆయన నటించి మెప్పించారు. రాజకీయాల్లోనూ ఎన్టీఆర్ వారసుడిగా ప్రజా సేవలో ఉన్నారు. 2014లో హిందూపురం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై.. హ్యాట్రిక్ విజయాలు సాధించారు. సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజల అభిమానం చూరగొన్నారు. బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి చైర్మన్‌గా సేవలు అందిస్తున్నారు. అర్ధశతాబ్దపు సినీ ప్రస్థానంలో ఎన్నో విజయాలు సాధించారు. కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు.

కడవకల్లు బిడ్డ..మాడుగుల



పుట్లూరు మండలం కడవకల్లు గ్రామానికి చెందిన మాడుగుల నాగఫణి శర్మకు పద్మశ్రీ పురస్కారం దక్కింది. ఆయన తల్లిదండ్రులు మాడుగుల నాగభూషణ శర్మ, సుశీలమ్మ దంపతులు. 1959లో కడవకల్లులో నాగఫణి శర్మ జన్మించారు. ఈయనకు ఐదుగురు అన్నదమ్ములు, ముగ్గురు అక్క చెల్లెల్లు ఉన్నారు. మొత్తం 9మందిలో నాగఫణి శర్మ రెండో సంతానం. పదో తరగతి వరకు మాత్రమే చదివి, ఆధ్యాత్మికత వైపు వెళ్లారు. ఉమ్మడి జిల్లాలోని కడవకల్లు, పుట్లూరు, లేపాక్షి, కడప జిల్లా ప్రొద్దుటూరులో ఈయన చదువు కొనసాగింది. పద్మ పురస్కారానికి ఎంపికైన ఆయనకు బంధుమిత్రులు, గ్రామస్థులు శుభాకాంక్షలు తెలిపారు.

అభిమానుల సంబరాలు

బాలయ్యకు పద్మభూషణ్ పురస్కారం దక్కిందని తెలియగానే ఉమ్మడి జిల్లాలో ఆయన అభిమానులు సంబరాలు చేసుకున్నారు. మంత్రి సవిత, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర్ ప్రసాద్, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రెండు జిల్లాల అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, కొల్లకుంట అంజినప్ప, టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర నాయకుడు గాజుల ఆదెన్న, టీడీపీ రాష్ట్ర నాయకులు ఆలం నరసానాయుడు, తలారి ఆదినారాయణ, గౌస్‌మొద్దీన్, గంజె నాగరాజు, మాజీ మేయర్ స్వరూప హర్షం వ్యక్తం చేశారు.


561మందికి ఉత్తమ సేవా పురస్కారాలు

పుట్టపర్తి, జనవరి25(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ సత్యసాయి జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో విశిష్ట సేవలందించిన 561 మందిని ఉత్తమ సేవా అవార్డులకు ఎంపిక చేశారు. పుట్టపర్తిలోని శిరాసాని హిల్స్ వద్ద పోలీస్ పెరేడ్ మైదానంలో ఆదివారం నిర్వహించే గణతంత్ర వేడుకల్లో జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ ఉత్తమ సేవా ప్రశంసా పత్రాలను అందజేయనున్నారు. ఇందులో జిల్లా స్థాయి ఉన్నతాధికారులతోపాటు డివిజన్, మండల స్థాయిలో పలు శాఖల్లో ఉద్యోగులను ఎంపిక చేశారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రెయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

శివలెంక శంభుప్రసాద్ (జయంతి)




పత్రికా సంపాదకుడిగా పేరొందిన శివలెంక శంభుప్రసాద్ 1911 జనవరి 26న కృష్ణా జిల్లా ఎలకుర్రులో జన్మించారు. 1938లో ఆంధ్ర పత్రిక, భారతి పత్రికలకు సంపాదకులుగా 34ఏళ్లపాటు సుదీర్ఘంగా వ్యవహరించి తెలుగు పత్రికారంగంలో ఎన్నో కొత్తరీతులు ప్రవేశపెట్టారు. పీటీఐ డైరెక్టర్‌గా కొంత కాలం వ్యవహరించారు. 'పడక కుర్చీ భావాలు' శీర్షికతో వ్యంగ్య వ్యాసాలు, తెలుగు వెలుగులు శీర్షికన ప్రముఖుల పరిచయాలు ఎంతో పేరొందాయి. రాజ్యసభ సభ్యులుగా, ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులుగా వ్యవహరించారు. 1972 జూన్ 8న కన్నుమూశారు.

గుమ్మడి వెంకటేశ్వరరావు (వర్ధంతి)



ఇంటిపేరు గుమ్మడితో పేరొందిన గుమ్మడి వెంకటేశ్వరరావు 1927 జూలై 9న గుంటూరు జిల్లాలో జన్మించారు. తెలుగు సినీ రంగంలో ఐదు దశాబ్దాలలో 500కుపైగా సినిమాలలో విభిన్న తరహాపాత్రలు పోషించారు. పౌరాణిక, జానపద, సాంఘిక, చారిత్రక ఇలా అన్నిరకాల చిత్రాలలో తండ్రిగా, అన్నగా, తాతగా పలు విభిన్న పాత్రల్లో నటించారు. రఘుపతి వెంకయ్య అవార్డు ఇతర పురస్కారాలు పొందారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆయనను కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించింది. 2010 జనవరి 26న కన్నుమూశారు.

కోబి బ్రాయంట్ (వర్ధంతి)



అమెరికాలో పేరొందిన బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు కోబి బీన్ బ్రాయంట్ 1978 ఆగస్టు 23న ఫిలడెల్ఫియాలో జన్మించారు. షూటింగ్ గార్డ్‌గా రాణించారు. 20 ఏళ్ల క్రీడా జీవితంలో లాస్ ఏంజెల్స్ లేకర్స్‌లోని నేషనల్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్‌లో గడిపారు. నేషనల్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ (ఎన్‌బీఏ) హిస్టరీలో 20 సీజన్స్‌లో తొలి గార్డ్‌గా నిలిచారు. 'బ్లాక్ మాంబా' అని తనకు తాను నిక్‌నేమ్ పెట్టుకున్నాడు. 2008, 2012 సమ్మర్ ఒలింపిక్స్‌లో రెండు బంగారు పతకాలు సాధించారు. 2020 జనవరి 26న విమాన ప్రమాదంలో మృతి చెందారు.

విజయ్ శంకర్ (పుట్టినరోజు)



విజయ్ శంకర్ 1991 జనవరి 26న తమిళనాడు రాష్ట్రం తిరునల్వేలిలో జన్మించారు. జాతీయ క్రికెట్ జట్టులో ఆల్‌రౌండర్‌గా ఉంటూ రైట్‌హ్యాండ్ బ్యాట్స్‌మన్‌గా, మీడియం పేసర్‌గా కొనసాగుతున్నారు. 2014-15 తమిళనాడు నుంచి రంజీ ట్రోఫీలో పాల్గొని రెండుసార్లు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారు. 2019 క్రికెట్ వరల్డ్‌కప్‌లోనూ పాల్గొని సత్తా చాటుకున్నారు. ఆస్ట్రేలియాపై వన్డేమ్యాచ్‌లో కీలకంగా వ్యవహరించారు. 2022 నుంచి 2024 వరకు ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ జట్టు తరపున ఆడారు.

ఆరోగ్యకరమైన పాదరక్షలు వాడాలి

బెంగళూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన పాదరక్షలకు ప్రాధాన్యత ఇవ్వాలని వాకరూ సంస్థ ఎండీ నౌషాద్ తెలిపారు. వాకరూచే వెయ్యి కొత్త మోడల్స్‌ను ట్రేడ్‌షో ద్వారా విడుదల చేశారు. శనివారం నగరంలో జరిగిన కార్యక్రమంలో ఎండీ మాట్లాడుతూ వినియోగదారులు ఇష్టపడే ఫ్యాషన్, కాళ్లకు అనువైన పాదరక్షలు సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్రంలో మూడు ఉత్పాదనా కేంద్రాలు ఉన్నాయని 12వేలకుపైగా రిటైల్ వ్యాపారుల ద్వారా సమకూరుస్తున్నామన్నారు. అన్నివర్గాలకు అనువైన పాదరక్షలు మా ఆశయమన్నారు.

ఓటు హక్కు ప్రాధాన్యమైనది

● న్యాయాధికారి హెచ్ఏ సాత్విక్

రాయచూరు జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని వయోజనులందరికి ఎలాంటి వివక్షకు అవకాశం లేకుండా కల్పించిన ఓటు హక్కు విలువను దాన్ని ప్రాధాన్యతను ప్రతియొక్కరు గుర్తెరగాలని జిల్లా కోర్టు సీనియర్ న్యాయాదికారి, జిల్లా న్యాయసేవా ప్రాధికార సభ్య కార్యదర్శి హెచ్ఏ సాత్విక్ అన్నారు. జాతీయ ఓటరు దినాచరణను పురస్కరించుకుని శనివారం నగరంలోని రంగమందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించి న్యాయధికారి మాట్లాడారు. ఇటీవల కాలంలో ఓటు హక్కు వినియోగం పట్ల ప్రజల్లో నిరాసక్తత పెరుగుతుండడం ఆందోళనకరమన్నారు. ఓటు హక్కు ప్రతియొక్కరికి సంక్రమించిన కనీస బాధ్యతగానే గుర్తించాలన్నారు. ఓటు ద్వార నిజమైన ప్రజాప్రతినిధులను ఎన్నుకునే అవకాశం రాజ్యాంగం ప్రజలకు కల్పించిందన్నారు. ఓటు హక్కు వినియోగంలో ఎలాంటి ఒత్తిడి లేదా ప్రలోభం ఇతరత్ర అప్రయోజనకరమైన వాటికి లొంగకుండా సద్వినియోగం చేసుకునే విచక్షణ ప్రతి పౌరులు కలిగి ఉండాలన్నారు. అదే సమయంలో కులం, మంతం పేరుతో ఓటు వేయడం సరికాదని నిజంగా ప్రజా అభ్యుదయం పట్ల నిబద్ధత ఉన్న వారిని నాయకులుగా ఎన్నుకునేందుకు ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాగా ఓటరు చైతన్యం కోసం జిల్లా యంత్రాంగం చేపట్టిన వివిధ కార్యక్రమాల గురించి మాట్లాడిన న్యాయాధికారి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వార ప్రజల్లో ఓటు హక్కు పై అవగాహన పెరుగుతుందన్నారు.

సమస్యల పరిష్కారం కోసం ఆందోళన

రాయచూరు జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : వివిధ సమస్యల పరిష్కారం కోరుతు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం నగరంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. మహాత్మగాంధి స్టేడియం వద్ద ఏర్పాటు చేసిన ప్రదర్శనలో వేలాది మంది మహిళలు పాల్గొని తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చే ప్రయత్నం చేశారు. ప్రభుత్వం పాఠశాలల్లో గుణాత్మక విద్యను బోధించడంతో పాటు కల్యాణ కర్ణాటక ప్రాంతంలో పౌష్టికాహార లోపాన్ని నివారించడం మహిళల కర్తహీనత బారినపడకుండా తగిన వైద్యచికిత్సనందిచడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో శుద్ధీకరించిన సురక్షిత తాగు నీటి అందించడం వంటి డిమాండ్లను ఈ సందర్భంగా వారు వినిపించారు. ప్రజాసమస్యలను పరిష్కరించడంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, మంత్రులు నిర్లక్ష్యం చూపడాన్ని తీవ్రంగా ఖండించారు.

ప్యాలెస్ గ్రౌండ్స్ వినియోగానికి ఆర్డినెన్స్

- టీడీఆర్‌పై అభ్యంతరం - కేబినెట్ తీర్మానం
- మేం ఎవరికీ ఇబ్బంది కలిగించలేదు
- మైసూరు రాజమాత ప్రమోదాదేవి ఒడయార్




హెచ్‌కె పాటిల్, ప్రమోదాదేవి ఒడయార్

బెంగళూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు ప్యాలెస్ మైదానాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ఆర్డినెన్స్ జారీ చేసేలా కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకున్నట్టు శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ వెల్లడించారు. 1996లో బెంగళూరులోని ప్యాలెస్‌ను ప్రభుత్వ అధీనంలోకి తీసుకునేలా ఆదేశాలు జారీ అయ్యాయని, గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి పంపగా అంగీకారం అయ్యాయన్నారు. 472 ఎకరాల భూమిని అప్పటి మార్కెట్ ధర ప్రకారం రూ.11 కోట్లుగా నిర్ణయించారన్నారు. 1996లో భూస్వాధీన చట్టాన్ని మైసూరు మహారాజు ప్రశ్నించారన్నారు. ఆయన వాదనలకు హైకోర్టులో అభ్యంతరాలు రాగా చివరకు సుప్రీంకోర్టులో సివిల్ అప్పీల్‌కు వెళ్లారన్నారు.

ఎట్టి పరిస్థితుల్లోనూ టీడీఆర్ ఇచ్చేది లేదు

అయితే టీడీఆర్ (ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్‌మెంట్ రైట్స్) వ్యవస్థ అమలులోకి వచ్చాక జయమహల్ రోడ్డు, బళ్ళారి రోడ్డు విస్తరణ నేపథ్యంలో మళ్ళీ ఈ అంశం చర్చకు వచ్చింద న్నారు. ప్రతి ఎకరాకు రూ.2.30 లక్షల పరిహారం ఇవ్వాలని సూచించారన్నారు. ఇన్నేళ్ళు వివాదం వ్యాజ్యం కొనసాగుతుండగా ఆదేశాలకు స్టే రాలేదన్నారు. 2004లో సుప్రీంకోర్టులో చట్ట ఉల్లంఘన అధికారులపై ఉందన్నారు.

ప్యాలెస్ మైదానం విస్తరణకు సంబంధించి విలువ ఆధారిత మార్పుకు కోర్టు ఆదేశించిందన్నారు. 15.36 ఎకరాల భూమి, ప్రతి ఎకరాకు రూ.200 కోట్లు చొప్పున రూ.3,014 కోట్లు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఎకరాకు రూ.2.30 లక్షలు నిర్ధారించగా ప్రస్తుతం రూ.3,014 కోట్ల ప్రతిపాదనకు పొంతన లేదన్నారు. ఇంత భారీ మొత్తం అభివృద్ధికి ఆటంకం కాగలదన్నారు. అంతేకాకుండా బెంగళూరు ప్యాలెస్ రోడ్డు విస్తరణకు సంబంధించి టీడీఆర్‌ను వారసుదారులకు ఇవ్వరాదని కేబినెట్ నిర్ణయించిందని మంత్రి హెచ్‌కే పాటిల్ తెలిపారు.

టార్గెట్ చేశారు - మైసూరు రాజమాత ప్రమోదాదేవి ఒడయార్

మేం ఎవరికీ ఇబ్బంది కలిగించలేదని, కానీ మమ్మల్ని టార్గెట్ చేస్తున్నారని మైసూరు రాజమాత ప్రమోదాదేవి ఒడెయార్ తెలిపారు. శనివారం మైసూరులో మీడియాతో మాట్లాడుతూ బెంగళూరు ప్యాలెస్ మైదానానికి సంబంధించి ప్రభు త్వం ఆర్డినెన్స్‌తో ముందుకు రావడంపై స్పందించారు. మైసూరు రాజవంశాన్ని కొన్నేళ్లుగా టార్గెట్ చేస్తున్నారన్నారు. 40ఏళ్లుగా పోరాటం చేస్తున్నామన్నారు. అన్యాయం జరిగితే న్యాయపోరాటం చేస్తామన్నారు. బెంగళూరు ప్యాలెస్ మైదానం భూమికి సంబంధించి టీడీఆర్ ఇచ్చే విషయంలో మైసూరు రాజ కుటుంబం, సీఎం సిద్దరామయ్య నేతృత్వంలోని ప్రభుత్వం మధ్య విభేదాలు పెరుగుతున్నాయి. సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేయాల్సిన ప్రభుత్వం ఏకంగా ఆర్డినెన్స్ జారీకి నిర్ణయం తీసుకుంద న్నారు. ప్యాలెస్ రోడ్డు విస్తరణకు సంబంధించి టీడీఆర్ విస్తరణకు కేబినెట్ నిరాకరించింది. వారసుదారులకు టీడీఆర్ ఇవ్వరాదని కేబినెట్ తీర్మానించింది. ఈ వివాదం ఎటు దారితీస్తుందోనని ఆందోళన నెలకొంది.

ప్రతిపౌరుడు ఓటు హక్కు వినియోగించుకోవాలి : గవర్నర్



ఓటరు దినోత్సవంలో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ తదితరులు

బెంగళూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఓటు ప్రతి పౌరుడికి వజ్రాయుధం లాంటి హక్కు అని హక్కును వినియోగించుకోవడాన్ని బాధ్యతగా భావించాలని గవర్నర్ థావర్‌చంద్‌గెహ్లాట్ అభిప్రాయపడ్డారు. జాతీయ ఓటరు దినోత్సవంలో భాగంగా రాష్ట్ర ఎన్నికల విభాగం శనివారం టౌన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గవర్నర్ ముఖ్యులుగా పాల్గొన్నారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వివిధ విభాగాలలో సేవలందించిన ఉత్తమ అధికారులు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ 1950 జనవరి 25న భారత ఎన్నికల కమిషన్ ఏర్పాటైందన్నారు. 2011 నుంచి ఏటా జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించే సంప్రదాయం కొనసాగుతోందన్నారు. మనదేశంలో కొనసాగే ఎన్నికలను ప్రపంచంలోని పలు దేశాలు ఆదర్శంగా భావిస్తున్నాయన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మనోజ్‌కుమార్ మీనా, బీబీఎంపీ చీఫ్ కమిషనర్ తుషార్‌గిరినాథ్ తదితరులు పాల్గొన్నారు. ఓటరు జాబితా సవరణలో సమగ్రంగా అమలు చేసిన రామనగర జిల్లా అధికారి డాక్టర్ అవినాశ్ మీనన్, మండ్య జిల్లా అధికారి కుమార్, బాగల్కోట జిల్లా అధికారి కేఎన్ జానకి, యాదగిరి జిల్లా అధికారి డాక్టర్ సుశీలకు ఉత్తమ అధికారుల అవార్డులను ప్రదానం చేశారు. కొత్తగా జాబితాలో చేరిన వారికి ఓటరు గుర్తింపుకార్డులను గవర్నర్ ప్రదానం చేశారు.

ఆలయాలతో శాంతియుత జీవనం



గంగమ్మదేవికి అలంకరణ

ముళబాగిలు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో దేవాలయాల ద్వారా శాంతియుత జీవనం, మానసిక ప్రశాంతత సాధ్యమని కాంగ్రెస్ నాయకుడు వి ఆదినారాయణ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని కొత్త మంగళ గ్రామంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ దేవాలయాన్ని శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. దేవుడి కృపతోనే ఎలాంటి కష్టానికైనా పరిహారం సాధ్యమని అభిప్రాయపడ్డారు. కొత్తమంగళ గ్రామంలో పలు దేవస్థానాలు, దర్గాలు ఉన్నా ప్రజలు సౌహార్ద్రతతో ఉత్తమజీవనం సాగిస్తున్నారన్నారు. కాగా రాష్ట్రంలో ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగుతుండడంతో తాలూకా ప్రజల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. గ్రామ సమస్యలు ఏవైనా కాంగ్రెస్ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చునన్నారు. కోలారు ఎమ్మెల్యే కొత్తూరు జి మంజునాథ్ మార్గదర్శకంలో పార్టీ బలోపేతానికి పాటుపడుతున్నట్టు తెలిపారు. ఆవణి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎంసీ నీలకంఠేగౌడ మాట్లాడుతూ గంగమ్మ దేవాలయ నిర్మాణానికి ప్రజలంతా తమ ఐకమత్యాన్ని ప్రదర్శించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆలంగూరు శివణ్ణ, కాంగ్రెస్ టౌన్ బ్లాక్ అధ్యక్షుడు అమానుల్లా, పీఎల్‌డీ బ్యాంకు డైరెక్టర్ ఆర్ఆర్ రాజేంద్రగౌడ, జడ్పీ మాజీ సభ్యుడు ఉత్తనూరు అరవింద్, దరఖాకస్తు కమిటీ సభ్యులు జమ్మనహళ్ళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యంగిరాదేవి హోమం

విజయపుర, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలో ధర్మరాయస్వామి ద్రౌపతమ్మ ఏళు సుత్తినకోటె యువబళగ ఆధ్వర్యంలో శనివారం పురసభ సమీపాన ప్రత్యంగిరాదేవి హోమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఉదయం 8 గంటలకు గంగపూజ, గణపతి పూజ, పుణ్యాహవచనం, నాంది, నవగ్రహ పూజ, మహామృత్యుంజయ పూజ, ప్రధాన కళశాలతో వాస్తుహోమం అనంతరం ప్రత్యంగిరాదేవి హోమాన్ని నిర్వహించారు. ధర్మరాయస్వామి ద్రౌపతమ్మదేవి ఆలయ కమిటీ అధ్యక్షుడు చిన్నప్ప ఏటా అణ్ణమ్మదేవి ఉత్సవం జరిపే తరహాలోనే ఈసారి విశేషపూజలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పురసభ సభ్యుడు రాజణ్ణ, మాజీ సభ్యులు మునికృష్ణ, జీఎం చంద్రు, తాలూకాసంఘం డైరెక్టర్ అంజనప్ప, పట్టణసంఘం ఉపాధ్యక్షుడు ఎల్లప్ప, కోశాధికారి ముని నారాయణప్ప, సభ్యులు తదితరులు పాల్గొన్నారు. విశేషపూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాసోహం నిర్వహించారు.



పూజల్లో పాల్గొన్న స్థానిక ప్రముఖులు

సరుకు వాహనాల్లో ప్రయాణికులకు బ్రేక్



ఇటీవల ప్రమాదానికి గురైన లారీని పరిశీలిస్తున్న ఉత్తరకన్నడ జిల్లా ఎస్పీ నారాయణ (ఫైల్)

బెంగళూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తరకన్నడ జిల్లాలో ఇటీవల లారీ బోల్తా పడిన సంఘటనలో 10మంది మృతి చెందిన ఘటన నేపథ్యంలో జిల్లా పోలీసుశాఖ అప్రమత్తమైంది. గూడ్స్ వాహనాలలో ప్రయాణికుల సంచారాన్ని పూర్తిగా నిషేధించింది. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాతో పాటు కేసులు కూడా నమోదవుతాయని ఎస్పీ ఎం నారాయణ హెచ్చరించారు. సరుకు వాహనాలలో ప్రయాణీకులను తీసుకెళ్లరాదని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా చాలామంది పాటించడం లేదన్నారు. ఉత్తరకన్నడ జిల్లా భౌగోళికంగా ఎంతో విశాలమైనదని అయితే రహదారి వ్యవస్థ సమగ్రంగా లేదన్నారు. ఎక్కువగా వ్యాపార లావాదేవీలు ఇతర జిల్లాలనుంచి వచ్చిన వ్యాపారస్తులే కొనసాగిస్తుంటారన్నారు. లారీలలో ఇష్టం వచ్చినట్టు సరుకులను అమర్చి కనీసంగా కూడా కూర్చునే అవకాశం లేనంత లోడుతో వెళ్లారని ఇదే వాహనం అదుపుతప్పడానికి ప్రధాన కారణమన్నారు. బుధవారం జరిగిన ఘటనలో అత్యధిక ప్రాణనష్టానికి ఇది కారణమన్నారు. సాధారణంగా లారీలో డ్రైవర్‌తోపాటు క్లీనర్‌కు అవకాశం ఉంటుందని అయితే ఈ ఘటనలో 28మంది ప్రయాణీకులు ఉన్నారన్నారు. గొర్రెలమంద తరహాలో కూరగాయల లోడుతోపాటు ప్రయాణీకులను తరలించారన్నారు. జిల్లాలో వివిధ ప్రదేశాలకు కూలీలను తరలించేందుకు మినీ లారీ, చిన్నపాటి సరుకు వాహనాలు, పెద్ద లారీలను ఉపయోగిస్తున్నట్టు తెలుస్తోందన్నారు. అడపాదడపా ఘటనలు వెలుగు చూస్తే జరిమానాతో వదిలేసేవారన్నారు. అయితే ఇటీవలికాలంలో ప్రమాదాల నేపథ్యంలో గస్తీని పెంచి కఠిన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. నేరాల నియంత్రణకోసం రాత్రిపూట గస్తీ నిర్వహించే అధికారులు తప్పనిసరిగా ఆయుధాలు కల్గి ఉండేలా సూచించామన్నారు.

తారురోడ్డు పనులకు శ్రీకారం

శిడ్లఘట్ట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని జంగమకోటె హోబళి భైరసంద్ర గ్రామంలో శనివారం తారురోడ్డు పనులకు ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్ శ్రీకారం చుట్టారు. శిడ్లఘట్ట - హొస్కోటె మెయిన్ రోడ్డు నుంచి భైరసంద్ర గ్రామాన్ని అనుసంధానం చేసే రోడ్డు డాంబరీకరణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచిస్తూనే ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించాలని హెచ్చరించారు. ఎంతోకాలంగా దుస్థితిలో ఉన్న రోడ్డును బాగు చేయడానికి సిద్ధం కావడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, రైతులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే రవికుమార్

ఉత్సాహంగా సైన్స్ పోటీలు



బహుమతుల ప్రదానంలో ప్రముఖులు

బెంగళూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో పాఠశాల స్థాయిలో సైన్స్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. నగర వ్యాప్తంగా 85 పాఠశాలల నుంచి 1500మంది విద్యార్థులు పాల్గొనగా ఫైనల్స్‌లో 26మంది బరిలో నిలవగా ముగ్గురు విజేతగా నిలిచారు. సుస్థెనబుల్ ప్రాజెక్ట్ అండ్ రీసెర్చ్ చాలెంజ్ (స్పార్క్ 2025) పేరిట పోటీలు సాగాయి. శనివారం వివిధ విభాగాల విజేతలను ప్రత్యేకంగా సత్కరించారు. దర్శిల్‌రెడ్డి, అద్రితి గుప్త, ఖురాత్‌లు విజేతలుగా నిలిచారు. ఇండియన్ ఎలక్ట్రానిక్స్ అండ్ సెమికండక్టర్ అసోసియేషన్ చైర్‌పర్సన్, టెస్సాల్వ్ కో-ఫౌండర్ డాక్టర్ వీరప్పన్ తదితరులు ముఖ్యులుగా పాల్గొన్నారు.

తెలుగు అధ్యాపకుడు, సాహితీవేత్త

తంగిరాల సుబ్బారావు కన్నుమూత

- బెంగళూరు యూనివర్సిటీలో 23 ఏళ్లు సేవలు



ఆచార్య తంగిరాల సుబ్బారావు (ఫైల్)

బెంగళూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు యూనివర్సిటీ తెలుగు విభాగం మాజీ అధిపతి, ప్రముఖ సాహితీవేత్త ఆచార్య తంగిరాల సుబ్బారావు (90) శనివారం కన్నుమూశారు. నగర శివారులోని కెంగేరిలోని నివాసంలోనే తుదిశ్వాస వీడినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన భార్య శకుంతల ఇప్పటికే మృతి చెందగా ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. బెంగళూరు యూనివర్సిటీలో కన్నడ విభాగంలో చేరిన అనంతరం తెలుగు విభాగాన్ని ప్రారంభించారు. 1972 నుంచి అధ్యాపకుడిగా కొనసాగారు 1995లో యూనివర్సిటీలో తెలుగు విభాగపు అధిపతిగా పదవీవిరమణ పొందారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు పరిధిలోని కాకుల ఇల్లిందపర్రు గ్రామంలో జన్మించిన తంగిరాల సుదీర్ఘకాలం బెంగళూరులోనే సేవలు కొనసాగించారు. బెంగళూరులో తెలుగుసాహిత్యంలో ఆయన సుపరిచితుడిగా పేరొందారు. భాషాభిమానంతో శ్రీరస అనే సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంస్థను స్థాపించి తెలుగు పుస్తకాలను రచించారు. చివరి రోజుల దాకా తెలుగు సాహిత్యం కోసం ఆయన సేవలు కొనసాగించారు. రాష్ట్రేతర తెలుగు మహాసభలో భాగంగా శ్రీకృష్ణదేవరాయ కళామందిరంలో ఆయనకు సాహితీరత్న పురస్కారాన్ని అందించారు. తెలుగు విజ్ఞాన సమితితోపాటు సీపీబ్రౌన్ సేవా సంస్థ పలు తెలుగు సంస్థలు తంగిరాల మృతి పట్ల ప్రగాఢసంతాపం వ్యక్తం చేశాయి. ప్రత్యేకంగా కార్యక్రమాలు జరిపారు. తంగిరాల సుబ్బారావు మృతిపట్ల మల్లేశ్వరం ఎమ్మెల్యే అశ్వత్థనారాయణ, తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షుడు రాధాకృష్ణరాజు, సీపీ బ్రౌన్ సేవా సమితి అధ్యక్షుడు ఇడమకంటి లక్ష్మిరెడ్డి, బెంగళూరు యూనివర్సిటీ తెలుగు విభాగం అధిపతి ఆశాదేవి సహా రాష్ట్రానికి చెందిన పలువురు తెలుగు ప్రముఖులు వ్యక్తం చేశారు.

క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలి

బంగారపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో ఎవరు గెలుపొందినా ఓటమి చెందినా అంతా బెస్కాం సిబ్బందియేనని కేవలం క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి పేర్కొన్నారు. తాలూకాలోని కుప్పనహళ్ళి మోది మైదానంలో 76వ గణతంత్ర దినోత్సవం, కేటీపీసీఎల్, ఎస్కాంల మృతి చెందిన ఉద్యోగుల సంస్మరణార్థం టెన్నిస్‌బాల్ పోటీలను శనివారం ప్రారంభించి మాట్లాడారు. బెస్కాం శాఖ అధికారులు, సిబ్బంది ఐకమత్యంగా పోటీలు ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. గెలుపొందినవారు రానున్న రోజుల్లో జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయికి చేరాలని ఆకాంక్షించారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. కాగా తాలూకాలో ఇప్పటికే 5 కొత్త విద్యుత్ స్టేషన్‌లను మంజూరు చేశామని స్థల పరిశీలన చేస్తున్నామన్నారు. మరో ఏడాదిలోగా కొత్త సబ్‌స్టేషన్‌లు ఏర్పాటు కావడం ద్వారా తాలూకాలో ఓల్టేజ్ సమస్య ఉండదన్నారు. ఈ సందర్భంగా పురసభ అధ్యక్షుడు గోవింద, సభ్యులు కే చంద్రారెడ్డి, బెస్కాం ఏఈఈ సుకుమార్ రాజు, ప్రముఖులు మహదేవప్ప, గాజగ కృష్ణప్ప, బెస్కాం సంఘం అధ్యక్షుడు బాబు, కార్యదర్శి నాగరాజ్, ఇన్‌స్పెక్టర్ రాజణ్ణ, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోటీల ప్రారంభంలో ఎమ్మెల్యే నారాయణస్వామి తదితరులు

పౌరకార్మికులకు యూనిఫాం పంపిణీ

మహదేవపుర, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సేవా మనోభావంతోనే మానవజన్మకు సార్థకత సాధ్యమని సమాజసేవకురాలు ప్రేమామ్మ అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలోని కాడుబీసనహళ్ళి గ్రామంలో సమాజసేవకుడు చంద్రశేఖరరెడ్డి జయంతి సందర్భంగా పౌరకార్మికులకు యూనిఫాం అందచేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సేవామనోభావంతో పెరిగిన చంద్రశేఖర్ సమాజంకోసం ఎంతో శ్రమించారన్నారు. ఆయన పేరిట రూ.3కోట్లతో అభయ ఆంజనేయస్వామి ఆలయాన్ని నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఇదే సందర్భంగా అనాథశ్రమానానికి అవసరమైన వస్తువులను సమకూర్చి అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు బాబురెడ్డి, మునికృష్ణ, మంజునాథ్‌గౌడ, మూర్తి, అశ్వథ్‌రెడ్డి, అంబరీశ్‌గుణ తదితరులు పాల్గొన్నారు.



యూనిఫాం అందజేస్తున్న నిర్వాహకులు

సాంస్కృతిక కార్యక్రమాలతో మానసిక ఉత్తేజం

● హాస్య కళాకారుడు డాక్టర్ బసవరాజ్ బెణ్ణె
● ఉత్సాహంగా ప్రారంభమైన యువజనోత్సవాలు



పసంగిస్తున్న డాక్టర్ బసవరాజ్ బెణ్ణె

రాయచూరు జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పాఠ్యేతర అంశాలైన క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం ద్వార మానసిక ఉత్తేజాన్ని పొందగలరని రిటైర్డ్ అధికారి ప్రముఖ హాస్య కళాకారుడు అన్నారు. 15వ అంతర్ విశ్వ విద్యాలయాల యువజనోత్సవాలను పురస్కరించుకుని నగరంలోని వ్యవసాయ విశ్వ విద్యాలయం బసవేశ్వర ఆడిటోరియంలో ప్రారంభమైన సాంస్కృతిక ఉత్సవాలను డాక్టర్ బసవరాజ్ బెణ్ణె జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన సాంస్కృతిక కార్యక్రమాలు కేవలం వినోదం కాకుండా విద్యార్థుల విజ్ఞానాన్ని పెంచేదిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉపకులపతి డాక్టర్ హనుమంతయ్య, డీన్ నారాయణ్ రావ్ తదితరులు పాఠ్యేతర అంశాల్లో భాగస్వాములు కావడం వల్ల విద్యార్థులు బహుముఖ ప్రజ్ఞావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కాగా యువజనోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వివిధ కరాల సాంస్కృతిక పోటీలను నిర్వహించగా వివిధ విశ్వ విద్యాలయాలకు చెందిన వందలాది మంది విద్యార్థులు పోటీలకు హాజరైయ్యారు. సంగీతం, నృత్యం, చిత్రలేఖనం తదితర పోటీల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని తమ కళను ప్రదర్శించారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1619.19	1,588.68
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	11.208	539
నీటి నిల్వ (టీఎంసీలు)	59.08	9.97

హత్యాయత్నం కేసులో ఏడేళ్ల జైలు శిక్ష

గంగావతి రూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో దోషికి కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. కారటగి తాలూకా పోలీసు స్టేషన్ పరిధిలో భార్య, భార్య సోదరిడినీ హత్యాయత్నం చేసిన కేసులో గంగావతి ఫస్ట్ అడిషనల్ జిల్లా సెషన్స్ కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష, రూ 5వేల రూపాయలు జరిమానా విధిస్తూ శనివారం తీర్పునిచ్చింది. శిక్షకు గురైన వ్యక్తి కారటగి తాలూకా ఘటప్రభ షుగర్ ఫ్యాక్టరీ నివాసి నాగనకల్‌కు చెందిన వాసప్ప వంత భీమప్ప చళ్వాయి. కారటగి పోలీసు పోలీస్టేషన్ పరిధిలో నాగనకల్ గ్రామానికి చెందిన సేవంతితో వాప్పకు వివాహమయ్యింది, వీరికి నలుగురు సంతానం. 2023 సెప్టెంబరు 9వ రాత్రి సేంవతి (నిందితుడి భార్య) నిద్రిస్తున్న సమయంలో వాసప్ప ఆమెతో ఘర్షణ పడి రోకలి తీసుకుని భార్య తలపై జోరుగా కొట్టి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదే సమయంలో ఇంటి బయట నిద్రిస్తు భార్య సోదరుడు పై కూడా హత్యాయత్నం చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి కారటగి పోలీసులు పోలీసు ఇన్‌స్పెక్టర్ సిద్రామయ్య కోర్టుకు ఛార్జ్‌షీటు అందజేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన ఫస్ట్ అడిషనల్ జిల్లా సెషన్స్ కోర్టు వాదనలు విన్న తర్వాత కేసు రుజువు కావడంతో నిందితుడికి జైలు శిక్షతో పాటు జరిమాన విధించి ఆదేశాలు జారీ చేసినట్లు న్యాయాధికారి నాగలక్ష్మి.ఎన్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

రాయచూరు జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం నగరంలో నిరసన ప్రదర్శన చేపటారు. గాంధీ స్టేడియం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వేలాది మంది మహిళలు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్యను బోధించడంతో పాటు కల్యాణ కర్ణాటక ప్రాంతంలో పౌష్టికాహార లోపాన్ని నివారించాలన్నారు. ప్రజాసమస్యలను పరిష్కరించడంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, మంత్రులు నిర్లక్ష్యం వహించడాన్ని తీవ్రంగా ఖండించారు.

ఉత్తమ నాయకుడిని ఎన్నుకోవడం ఓటరు కర్తవ్యం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న న్యాయాధికారి శాంతి, డీసీ ప్రశాంత్‌కుమార్

● ఓటరు దినోత్సవంలో జిల్లా న్యాయాధికారి కేజీ శాంతి

బళ్లారి సిటీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): దేశ ప్రగతికి ఉత్తమ నాయకుడిని ఎన్నుకోవడం ఓటరు కర్తవ్యమని, ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటు వేయాలని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ కేజీ శాంతి అన్నారు. శనివారం నగరంలోని అనంతపురం రోడ్డు నూతన జిల్లా పాలనా భవన్‌లోని హాల్లో భారత ఎన్నికల సంఘం, బళ్లారి జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయం, జిల్లాస్వీప్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'జాతీయ ఓటరు దినోత్సవం' కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. దేశంలోని యవత పెద్ద సంఖ్యలో ఓటింగ్ ప్రక్రియలో పాల్గొనేలా ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో 1950 లో ఏర్పాటైన భారత ఎన్నికల సంఘం వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని తొలిసారిగా జనవరి 25, 2011న జాతీయ ఓటరు దినోత్సవాన్ని జరుపుకున్నారు. దేశ అభివృద్ధి శ్రేయస్సు పట్ల పౌరులు తమ బాధ్యత, కర్తవ్యాన్ని గుర్తుచేసే ఉద్దేశంతో ఏటా ఓటరు దినోత్సవాన్ని జరుపుకుంటామన్నారు. 18ఏళ్ళు నిండిన యువతీ, యువకులు తప్పకుండా ఓటింగ్ ప్రక్రియలో పాల్గొనాలన్నారు. గతంలో జరిగిన బ్యాలెట్ పేపర్ ఎన్నికల్లో పెద్దలందరూ పండుగలా ఓటింగ్‌లో పాల్గొని ఓటింగ్ శాతం పెరగడానికి దోహదపడ్డారు. అయితే ఇప్పుడు విద్యావంతులు సైతం సోమరితనం కారణంగా ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నారన్నారు.

జిల్లా ఎన్నికల అధికారి , కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా అధ్యక్షత వహించి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. విద్యావంతులు తమ స్నేహితుల్లో, ఇంట్లో, ఇరుగుపొరుగు వారికి తప్పకుండా ఓటింగ్ ప్రక్రియలో పాల్గొనేలా అవగాహన కల్పించాలన్నారు. జిల్లా స్వీప్ కమిటీ చైర్మన్, జిల్లా పంచాయతీ ముఖ్యకార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాణంలో ఓటు హక్కు కీలకమైనదన్నారు. ఓటు వేయడం అందరి బాధ్యత అన్నారు. ఓటరు దినోత్సవంపై పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించిన వ్యాసరచన , పెయింటింగ్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు, అవార్డు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఈసందర్భంగా సీనియర్ సివిల్ న్యాయాధికారి రాజేష్ హొసమనె, అదనపు జిల్లాకలెక్టర్ మహమ్మద్ జుబేరా, సహాయ కమిషనర్ ప్రమోద్, తహశీల్దార్ గురురాజ్, జిల్లి రిటర్నింగ్ అధికారి, కార్యాలయ అధికారులు, సిబ్బంది, పాఠశాల, కళాశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కంప్లిలో..



విజేతలైన విద్యార్థులతో అధ్యాపకులు

కంప్లి : సమాజంలో అన్నిటికన్నా ఓటు హక్కు ఎంతో ప్రాధాన్యమైనదని తహసీల్దార్ శివరాజ్ కుమార్ తెలిపారు. కంప్లి పట్టణంలో శ్యామియాచంద్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓటు హక్కు దినోత్సవంలో పాల్గొనాలని తెలిపారు. ఓటు ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో తాలుకా ఈవో శ్రీకుమార్ అసిస్టెంట్ డైరెక్టర్ మల్లన్నగౌడ, పురసభ ముఖ్య అధికారి దుర్గన్న, ప్రొఫెసర్ బాలాజీ హెచ్ఎం బసవరాజు, సుజాత, సిబ్బంది అనిల్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు. ఓటు హక్కు వినియోగించుకోవాలి

సిరుగుప్పలో..

సిరుగుప్ప : ఓటర్లు విధిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని పంచాయతీ ఈఓ పవన్‌కుమార్ సూచించారు. సిరుగుప్ప పట్టణం తాలుకా పంచాయతీ భవనంలో జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని ప్రతిజ్ఞ విధి కార్యక్రమాన్ని చేపట్టారు. తాలుకా పంచాయతీ మేనేజర్లు వివిధ శాఖల అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

కిడ్నాప్ బాధితులకు 'గాలి' పరామర్శ



సునీల్ కుమార్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న గాలి జనార్దన్ రెడ్డి

బళ్లారి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో సత్యనారాయణ పేటలో కిడ్నాప్ అయిన వైద్యుడు డాక్టర్ సునీల్ కుమార్ కుటుంబ సభ్యులను మాజీ మంత్రి గాలి జనార్దన్ రెడ్డి పరామర్శించారు. శనివారం నగరంలోని ఎస్ఎన్‌పేటలోని సునీల్ కుమార్ ఇంటికి వెళ్లిన గాలి వారికి ధైర్యం చెప్పారు. ఆయనతో పాటు దమ్మూరు శేఖర్, అలీఖాన్, ఇతర బీజేపీ నాయకులు వారిని పరామర్శించారు. కిడ్నాపర్ల నుంచి వైద్యుడిని సురక్షితంగా పోలీసులు విడిపించి తీసుకొస్తారని, ఆందోళన చెందవద్దన్నారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు మరింత భద్రత పెంచాలని, నేరాలకు పాల్పడే వారిని ముందస్తుగా గుర్తించి వారికి వార్నింగ్ ఇవ్వడం, సంఘం నుంచి వెలివేయాలని సూచించారు.

ఆవిష్కరణలపై అవగాహన కల్పించాలి

బళ్లారి సిటీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): అధ్యాపకులు విద్యార్థులకు సరికొత్త అవిష్కరణలపై అవగాహన కల్పించి పరీక్షలకు సమర్థంగా సన్నద్ధం చేయడం అవసరమని బెంగళూరుకు చెందిన రసాయన శాస్త్రనిపుణుడు , రీసోర్స్ పర్సన్ రాజీవ్ నరేగల్ అన్నారు. నగరంలోని నల్లచెరువు ప్రభుత్వ పూర్వ గ్రాడ్యుయేషన్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన కెమిస్ట్రీ రిప్రెషర్ అండ్ టెస్ట్ ప్రిపరేషన్ ట్రైనింగ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏటా సిలబస్, ప్రశ్నపత్రం రకం మార్పులపై లెక్చరర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ టి. పాలక్ష మాట్లాడుతూ పీయూ(ఇంటర్) పరీక్షా ఫలితాల్లో మన జిల్లా, కల్యాణ కర్ణాటక వెనుకబడి ఉందని, విద్యార్థులు ఎక్కువగా ఉత్తీర్ణత సాధించే విధంగా సన్నద్ధం కావాలన్నారు. ఈ ఏడాది మంచి ఫలితాలు రావాలంటే లెక్చరర్ల కృషి అవసరమన్నారు. ఈకార్యక్రమంలో కొప్పళ, రాయచూరు, విజయనగరం, బళ్లారి జిల్లాల కెమిస్ట్రీ ఫోరం శ్రీధర్ ప్రసాద్, నాగరాజు, సిద్దనగౌడ,బసవరాజ్, నాగన్న ఖంద్రే తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

బళ్లారి గాంధీనగర్/సిటీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించిన ఆబ్కారీ పోలీసులు రూ .87వేలు విలువ చేసే గాంజాను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో కౌల్ బజార్ నివాసి శేఖ్ మాలిక బాషా, సండూరు తాలూకా అంకమనాళ్ గ్రామానికి మాదయ్య సండూరు మారప్ప ముగ్గురు నిందితులను గుర్తించారు. మూడు కేసుల్లో మొత్తం రూ 1.66కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఆబ్కారీ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మంజునాథ్ తెలిపారు.

రైతు సమస్యలపై 13న నిరసన

కంప్లి, జనవరి 25 (ఆంధ్ర జ్యోతి) : రైతు సమస్యలపై ఫిబ్రవరి 13న నిరసన చేపట్టనున్నట్లు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శివశంకర్ తెలిపారు. శనివారం కంప్లి అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కంప్లి పట్టణంలో ఎన్నో ఏళ్లుగా నీటి కరువు తీరలేదన్నారు. తుంగభద్ర నదిపైనే ఆధారపడక తప్పదని, ఒకవేళ తుంగభద్ర నదిలో నీరు లేకపోతే నీటి కష్టాలు తప్పవన్నారు. కంప్లికి నీటి ఎద్దడి తప్పదన్నారు. రాబోయే తరాన్ని దృష్టిలో వుంచుకుని కంప్లి చుట్టుపక్కల చెరువు ఏర్పాటు చేసి, నీటి సమస్యలు తలెత్తకుంటూ చూడాలన్నారు. కొంత కాలంగా షుగర్ ఫ్యాక్టరీ ప్రారంభం కాక రైతులు నిరాశకు గురి అవుతున్నారని, బీద కుటుంబాలకు ఇల్లు స్థలాలు ఇవ్వాలన్నారు. అంబేద్కర్ సర్కిల్‌లో హొస్పేట, కురుగోడుకు వెళ్లే ప్రయాణికులకు మినీ బస్టాండు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే గంగావతి రైల్వే స్టేషన్ నుండి కంప్లి మీదుగా రోజుకి రైల్వే మార్గం సర్వే చేపట్టిందన్నారు. వసంతరాజు కాలే, మరిస్వామి, బండి బసవరాజు, కృతిబేగమ్, వన్నూరుసాబ్ బసవ, ఉమేష్, నాగరాజు, బసవరాజు, సంజీవ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శివశంకర్

దుబారా మాటలంటే సహించం

● శ్రీరాములుపై 'గాలి' వ్యాఖ్యలు సరికాదు ● ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి ● వాల్మీకి నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తిమ్మప్ప

బళ్లారి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి నాయకుడు, మాజీ మంత్రి శ్రీరాములు గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరికాదని, నోరు అదుపు పెట్టుకోకుంటే ఇంటిని ముట్టడిస్తామని మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డిని వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తిమ్మప్ప జోళదరాసి హెచ్చరించారు. శనివారం బళ్లారిలోని ఓ హోటల్‌లో వాల్మీకి సంఘం నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వాల్మీకి సంఘం అధ్యక్షుడు తిమ్మప్ప జోళదరాసి, కార్పొరేటర్ హనుమంత, ఉపాధ్యక్షుడు గోవింద రూపనగుడి, ఎన్. సత్యనారాయణ, రుద్రప్ప, ఉమేష్, తిమ్మప్ప, శివానంద తదితర వాల్మీకి రాష్ట్ర కమిటీ సభ్యులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిమ్మప్ప జోళదరాసి మాట్లాడుతూ గాలి జనార్దన్‌రెడ్డి వాల్మీకులను కించ పరిచే విదంగా మాట్లాడారన్నారు. శ్రీరాములు వల్లే జనార్దన్‌రెడ్డి ఎదిగారు కానీ జనార్దన్‌రెడ్డి వల్ల శ్రీరాములు కాదన్నారు. గాలి కంటే ముందే శ్రీరాములు రాజకీయాల్లో ఉన్నారన్నారు. ఇంత వరకూ బళ్లారిలో ప్రత్యక్ష ఎన్నికల్లో గెలిచే సత్తా జనార్దన్‌రెడ్డికి లేదన్నారు. శ్రీరాములు హంతకుడు అంటూ చేసిన వ్యాఖ్యలపై గాలి పై కేసు నమోదు చేయాలన్నారు. రైల్వే బాబు హత్య గురించి మాట్లాడేటప్పుడు బళ్లారిలో పద్మావతి హత్య పై ఎందుకు మాట్లాడలేరని ప్రశ్నించారు. జనార్దన్‌రెడ్డి వాల్మీకులను అడ్డు పెట్టుకుని ఆక్రమదందాలు, దౌర్జన్యాలు చేసి అక్రమంగా మైనింగ్ దోచుకున్నారన్నారు. గాలి వ్యాఖ్యలకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. గాలి జనార్దన్‌రెడ్డి శ్రీరాములుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం గాలిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

'గాలి'తోనే వాల్మీకి నాయకుల ఎదుగుదల

● ఎంతో మందిని ఎంపీలు, ఎమ్మెల్యేలు చేశారు ● నిండా మోసం చేసిన ఘనత శ్రీరాములుదే : బీజేపీ నాయకుల ధ్వజం



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు దరప్ప నాయక

బళ్లారి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గాలి జనార్దన్‌రెడ్డి సహకారంతోనే వాల్మీకి నాయకులకు గుర్తింపు వచ్చిందని, ఆయన ఎంతో మందికి రాజకీయ జీవితం అందించారని వాల్మీకి సంఘ నాయకులు, బీజేపీ నాయకుడు దరప్ప నాయక అన్నారు. శనివారం జనార్దన్‌రెడ్డికి మద్దతుగా బళ్లారిలోని ఓ హోటల్‌లో వాల్మీకి, ముస్లీం, ఎస్సీ, బోవి, రెడ్డి, లింగాయత్, బలిజ, ఇలా అన్ని వర్గాల నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయుకుడు దరప్ప నాయక మాట్లాడుతూ గాలి జనార్దన్‌రెడ్డి వాల్మీకీలకు ఎప్పుడు అన్యాయం చేయలేదన్నారు. ఆయన ద్వారా శ్రీరాములు, సురేష్‌బాబు, పక్కీరప్ప, సోమలింగప్ప, దివాకర్, నాగేంద్ర, ఇలా ఎంతో మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు అయ్యారని గుర్తు చేశారు. గాలి జనార్దన్‌రెడ్డి ఒక నాయకుడుగా ఉండి వాల్మీకులకు పెద్ద పీట వేశారని గుర్తు చేశారు. కేవలం ఆస్తి తగాదాలతో జనార్దన్‌రెడ్డి, శ్రీరాములు మధ్య బేధాభిప్రాయాలు ఏర్పడ్డాయని తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యేలుగా శ్రీరాములు, సురేష్ బాబు పేరుతో జనార్దన్‌రెడ్డి పెట్టిన స్థిర, చరాస్తులు శ్రీరాములు, సురేష్‌బాబు తిరిగి ఇవ్వకుండా ఇలా మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ ఇద్దరి మధ్య సండూరు ఎన్నికల నేపథ్యంలో వివాదాలు నెలకొన్నాయనేది కేవలం సాకు మాత్రమే అని వాస్తవానికి ఆస్తుల వ్యవహారంతో వివాదాలు చెలరేగాయన్నారు. ఈ ఇద్దరినీ కలిపేందుకు పార్టీ కేంద్ర మంత్రి ప్రహ్లాద జోషికి బాధ్యతలు అప్పగించిందని దరప్ప నాయక తెలిపారు. విలేకరుల సమావేశంలో వాల్మీకి నాయకులు దరప్ప నాయక, ఉమ్మరాజు, రాఘవేంద్ర, ఎస్సీ నాయకులు అసుండి సూరి, నరసింహబాబ, ఇతర కులస్తులు ఉండేకర్ రాజు, ప్రభాకర్ గౌడ, కొలగల్లు అంజి, జుజ్జిరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, మున్నాబాయ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

హొసూరు జోన్

పూల ధరలు తగ్గుముఖం



హొసూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): హొసూరు నగరంలోని పూల మార్కెట్‌లో శనివారం ధరలు తగ్గుముఖం పట్టాయి. తిరువణ్ణామలై, వేలూరు, మదురై, సేలం, కృష్ణగిరి, అంచెట్టి, శూలగిరి, బాగలూరు, బేరికై, రాయకోట్టై, తళి, అత్తిబెలె, చందాపుర, ఆనేకల్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 300 టన్నుల పూలు వస్తాయి. మేరిగోల్డ్, రోజా, జాస్మిన్, బటన్ రోజా, వైట్ రోజా, జర్బెరా, చెండుమల్లి, ఇల రక రకాల పూలు మార్కెట్టుకు వచ్చాయి. ఇక్కడి నుంచి కర్ణాటక, ఆంధ్రాతోపాటు పలు రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. చేమంతి కిలో రూ.40, మల్బరీ రూ.1000 నుంచి రూ.1200, గులాబీ రూ.80, చెండు మల్లి రూ.30, గన్నేరు రూ.120, కనకాంబరం రూ.1200 చొప్పున ధర ఉన్నాయని మార్కెట్ వర్గాల ద్వారా తెలుస్తోంది.

గుట్కా, మద్యం బాటిళ్ల స్వాధీనం

హొసూరు(క్రైం), జనవరి 25 (ఆంధ్రజ్యోతి): హొసూరు సిప్‌కాట్ పోలీసులు జూజూవాడీ చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. చెక్‌పోస్టు పరిసర ప్రాంతంలో కర్ణాటక రాష్ట్రం నుంచి మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో నియంత్రించేందుకు 24 గంటలూ నిఘా పర్యవేక్షిస్తుంటారు. శనివారం బెంగళూరు నుంచి వచ్చిన కారును పోలీసులు తనిఖీ చేశారు. తమిళనాడులో నిషేధించిన 27 కిలోల గుట్కా, 48 మద్యం బాటిళ్లను గుర్తించి కారు సహా వాటిని స్వాధీనం చేసుకున్నారు. డెంకణీకోట తాలూక దొడ్డమేట్టరీకు చెందిన సంతోష(31)ను అరెస్ట్ చేసి దర్యాప్తు చేపట్టారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలని పోలీసులు సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని వారు తెలిపారు.

జాతీయ ఓటరు దినోత్సవంపై అవగాహన ర్యాలీ


హొసూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): హొసూరు కార్పొరేషన్‌లో జాతీయ ఓటరు అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో హొసూరు సబ్ కలెక్టర్ ప్రియాంక ర్యాలీకి పచ్చజెండా చూపి ప్రారంభించారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ర్యాలీలో పాల్గొని ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేస్తూ ఓటు ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కామరాజర్ నగర్‌లోని తాలూకా కార్యాలయం, డెంకణీకోట రోడ్డు, నేతాజీ రోడ్డు, ప్రధాన రహదారుల గుండా హొసూరు సబ్ కలెక్టర్ కార్యాలయ కాంప్లెక్స్ వద్ద ముగిసింది. అనంతరం ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులచే కళా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేశారు. సబ్ కలెక్టర్, దేవదాయ శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు అవగాహనపై సంతకాలు చేశారు. కార్యక్రమంలో పలువురు రెవెన్యూ అధికారులు, కార్పొరేషన్ ఉద్యోగులు పాల్గొన్నారు.



పచ్చజెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న సబ్‌కలెక్టర్ ప్రియాంక

హైపోక్లోరైడ్ సిలిండర్ లీకేజీ

● తప్పిన పెను ప్రమాదం



లీకేజీ అయిన సిలిండర్ ఇదే...

హొసూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): హొసూరు బస్టాండ్ సమీపానగల ఈశ్వర్ నగర్‌లో ఒక సోడియం హైపోక్లోరైట్ సిలిండర్ ఈ ప్రాంతంలోని ఓవర్ హెడ్ వాటర్ స్టోరేజీ ట్యాంక్ నంచి సరఫరా చేసే త్రాగునీటిలో ఉండే బ్యాక్టీరియాను శుభ్రం చేయడానికి ఉపయోగించబడుతుంది. 5వేల లీటర్లు తాగునీటిలో ఆరు లీటర్లు మాత్రమే వినియోగించదగిన గ్యాస్, ఈ గ్యాస్ సిలిండర్ దాదాపు 100 లీటర్లు పట్టింది. శుక్రవారం ఒక్కసారిగా గ్యాస్ లీక్ కావడంతో స్థానిక ప్రాంత వాసులకు కళ్లు చెమర్చడంతో పాటు ఊపిరాడలేదు. ఈ విషయాన్ని వెంటే కార్పొరేషన్ ఉద్యోగులు గుర్తించి అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది సిలిండర్‌ను సురక్షితంగా వెలికితీసి వాటర్ ట్యాంక్‌లో వేసి సురక్షితంగా డియాక్టివేట్ చేశారు. సోడియం హైపోక్లోరిన్ లీక్ కావడంతో కొంతమంది స్పృహ కోల్పోయారని ఈశ్వర్‌నగర్, లక్ష్మినారాయణ నగర్ వాసులు తెలిపారు. వెంటనే పరిహార చర్యలు చేపట్టడంతో పెను ప్రమాదం తప్పింది.

విద్యార్థులకు పోటీలు

హొసూరు జనవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు స్టెమ్, రోబోటిక్ శిక్షణ ఇచ్చేందుకు భూమి, వెరిజోన్ సంస్థలు సంయుక్తంగా కృష్ణగిరి జిల్లాలోని 25 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో స్టెమ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. వీటిద్వారా పాఠశాల స్థాయి పోటీల్లో 2వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. 300కు విద్యార్థులు అదియమాన్ కళశాల ఆఫ్ ఇంజనీరింగ్ , హొసూరు క్యాంపస్‌లో జరిగిన స్టెమ్ ఫెస్ట్‌లో పాల్గొన్నారు. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణిత రంగాలకు ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులలోని ప్రతిభనువెలికితీసేందుకు పోటీలను నిర్వహించారు. హొసూరు సబ్ కలెక్టర్ ప్రియాంక ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రోబోటిక్స్‌లో కొత్త అవిష్కరణలు, వాటి ఏకీకరణను ప్రదర్శించడం పోటీ యొక్క ముఖ్య లక్షణం, స్టెమ్ ఫెస్ట్ పోటీ కృష్ణగిరి జిల్లాలోని విద్యార్థులల్లో ఆసక్తి రేకెత్తించింది. వినూత్న అవిష్కరణలతో రూపొందించడానికి వారిని ప్రోత్సాహించింది.



విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేస్తున్న సబ్‌కలెక్టర్

కార్మిక సంఘం పదాధికారుల నియామకం



అధ్యక్షుడు మన్నూరు రవి



గౌరవాధ్యక్షుడు లక్ష్మన్న

కంప్లి, జనవరి 25 (ఆంధ్ర జ్యోతి) : డాక్టర్ భీమారావు కట్టడ కూలీ కార్మిక రంగం పదాధికారుల నియామకం జరిగింది. అందులో జిల్లా అధ్యక్షుడిగా మన్నూరు రవి, గౌరవాధ్యక్షుడు లక్ష్మన్న సమాజంలో చేపడుతున్న సేవలను గుర్తించే వారికి హోదాలు కల్పించామన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన రవి, లక్ష్మన్నలు మాట్లాడుతూ తమపై నమ్మకం వుంచే ఈ పదవులను కల్పించారన్నారు. తావు సమాజ సేవలు మరువలేమన్నారు.

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం



పురసభ కార్యాలయాన్ని అలంకరిస్తున్న సిబ్బంది

కంప్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధమయ్యింది. ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా పాఠశాలలు, కార్యాలయాలు ముస్తాబయ్యాయి. పురసభ, జెస్కామ్, తహసీల్దార్ కార్యాలయం అంబేడ్కర్ సర్కిల్, నీటి పారుదల తదితర కార్యాలయాల్లో పతాకావిష్కరణ చేపట్టనున్నారు. తహసీల్దార్ శివరాజ్ మాట్లాడుతూ ఉదయం 7.30 లోపుగా తమ కార్యాలయంలో జెండా ఎగురవేసుకుని 8.30 లోపుగా శ్యామియాచంద్ పాఠశాల ఆవరణలోకి విద్యార్థులు ప్రముఖులు తదితరులు వేడుకలకు పాల్గొనాలని తెలిపారు.

నేడు అండర్ బ్రిడ్జి ప్రారంభం

బళ్లారి సిటీ,జనవరి 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని దుర్గమ్మ దేవాలయం సమీపంలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఆదివారం వాహనాల రాకపోకలను ప్రారంభిస్తున్నట్లు తెలిసింది. ఈరహదారి కాంట్రాక్ట్ రెడ్ ఇన్‌ఫ్రా ద్వారా నిర్మితి కేంద్రం రూ.1కోటి 8లక్షల అంచనా వ్యయంతో అభివృద్ధి చేసింది. కాంక్రీట్ రోడ్డు, ఇరువైపులా ఫుట్‌పాత్ నిర్మించారు. లైటింగ్ వ్యవస్థ ఇంకా పూర్తి కాలేదు. రహదారి నిర్మాణం కోసం వాహనాల రాకపోకలు నిలిపి వేయడంతో ఇతర మార్గాలద్వారా ట్రాఫిక్‌ను మళ్లించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డుకు ఇరువైపుల ఉన్న గోడలకు రకరకాల రంగులు వేసి ఇరువైపులా 'సువర్ణ బళ్లారి' అని రాశారు.